ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2003 / 89152

షణ్ముఖ వెలుగు
SHANMUKHAVELUGU

ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF PEN

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 180

మంగళవారం 07 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.






# ఆర్టీజీ కేంద్రం నుంచి ఇక 24 గంటల సేవలు...

- ప్రజా సమస్యలపై రియల్ టైమ్‌లో స్పందించాలని అధికారులకు సీఎం ఆదేశం
- పీజీఆర్ఎస్ కింద పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి
- పట్టణ ప్రాంతాల్లో జీరో వేస్ట్ లక్ష్యంగా మూడు నెలల్లో చెత్త తొలగింపు
- గంజాయిపై ఉక్కుపాదం మోపాలి, మహిళల భద్రతకు పెద్దపీట
- మారుమూల గ్రామాల్లో కమ్యూనికేషన్ టవర్ల ఏర్పాటుకు కార్యాచరణ

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)**

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై రియల్ టైమ్‌లోనే స్పందన ఉండాలని, ప్రభుత్వ సేవల్లో వేగాన్ని పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఐదు రోజుల జిల్లాల పర్యటన ముగించుకుని అమరావతికి చేరుకున్న ఆయన, సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్సు (ఆర్టీజీ) కేంద్రంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ వంటి కీలక శాఖల పనితీరు, ప్రజా సేవల్లో నాణ్యతపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవలు అందించగలమని, పాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన అన్నారు.రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రం నుంచి ప్రజలకు వాస్తవ సమయంలోనే స్పందన అందాలని చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖ సముద్ర తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనను ఉదాహరణగా 2



## రావణ్‌తో వైసీపీకి ఎలాంటి సంబంధాలు లేవు

**కక్ష సాధింపులకు పోలీసులను ప్రభుత్వం వాడుకుంటోందన్న అంబటి**
**సాధారణ యూట్యూబర్ రావణ్‌పై దేశద్రోహం చట్టాలను ప్రయోగించారని మండిపాటు**
**రావణ్‌కు న్యాయ సహాయం అందిస్తామని వెల్లడి**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)**

ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటూ ప్రతిపక్షాలే లక్ష్యంగా రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ నేతలతో పాటు సోషల్ మీడియా యాక్టివిస్టులు, రాజకీయ విశ్లేషకులను భయభ్రాంతులకు గురిచేసేందుకే అక్రమ కేసులు, అరెస్టుల పర్వానికి తెరలేపారని ఆయన మండిపడ్డారు.వివాదాస్పద యూట్యూబర్ రావణ్ (జోసెఫ్), కేవీఆర్ వంటి వారికి తమ వైసీపీతో ఎలాంటి ప్రత్యక్ష సంబంధాలు లేవని అంబటి స్పష్టం చేశారు. అయినప్పటికీ ఒక సాధారణ యూట్యూబర్‌పై దేశద్రోహం, 'ఉపా' వంటి కఠిన చట్టాలను ప్రయోగించడం ప్రభుత్వ దురహంకారానికి నిదర్శనమన్నారు. చట్ట పరిధి దాటి ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవచ్చు కానీ, దారుణమైన సెక్షన్లు పెట్టడం ఏంటని ప్రశ్నించారు.రావణ్‌ను శారీరకంగా అంతమొందించే ప్రయత్నాలు కూడా జరిగాయని అంబటి సంచలన ఆరోపణ చేశారు. ఈ కేసులో పిఠాపురం కోర్టుతో పాటు పలు న్యాయస్థానాలు రావణ్‌కు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా ప్రభుత్వం తన మొండి వైఖరిని మార్చుకోవడం లేదన్నారు. రావణ్ తమ పార్టీ వ్యక్తి కాకపోయినప్పటికీ, బాధితుడిగా అతనికి వైసీపీ తరఫున అవసరమైన పూర్తి న్యాయ సహాయాన్ని అందిస్తామని ప్రకటించారు.కేవీఆర్ అరెస్టు వ్యవహారంలో ఏపీ పోలీసులు కనీస చట్టపరమైన నిబంధనలు పాటించలేదని... మిగతా 2లో

## దక్షిణ కొరియాలో వివిధ సంస్థల ప్రతినిధులతో మంత్రి నారా లోకేశ్ భేటీ



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)**

దక్షిణ కొరియాలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. ఆ దేశ రాజధాని సియోల్‌లో వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలు, పారిశ్రామిక అనుకూలతలను లోకేశ్ వారికి వివరించారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్ రంగాల్లో ఏపీని గ్లోబల్ హబ్‌గా నిలపడమే లక్ష్యంగా మంత్రి పర్యటన కొనసాగింది. తొలుత దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్ షెల్ఫ్ లేబుల్స్, ఐఓటీ ఁ పవర్ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ సోలమ్ గ్రూప్ గ్లోబల్ ఆపరేషన్స్ ఆఫీసర్ జీగాబ్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. శ్రీసిటీలో రూ.338కోట్లతో సోలమ్ సంస్థ ఈవీ ఛార్జర్ పవర్ మాడ్యూల్స్, ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్ యూనిట్ నిర్మిస్తున్నందుకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. త్వరగా శ్రీసిటీ యూనిట్ నిర్మాణ పనులు పూర్తిచేసి ఉత్పత్తిని ప్రారంభించాలని కోరారు.అనంతరం ఎపిటాక్సీ, మైక్రో ఎల్ఈడీ, పవర్ ఎలక్ట్రానిక్స్ మెటీరియల్ తయారీ సంస్థ సాఫ్ట్-ఈపీఐ సీఈవో సుంగ్ మిన్ హ్వాంగ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. భారత్‌లోని కంపెనీలతో 2లో

## ప్రపంచంలోనే అత్యంత అందమైన ఎయిర్‌పోర్టులు... జాబితాలో రెండు భారత విమానాశ్రయాలు

**ప్రపంచంలోని అత్యంత అందమైన ఎయిర్‌పోర్టుల జాబితా విడుదల**
**ప్రిక్స్ వెర్సైల్స్ 2026 జాబితాలో రెండు భారత విమానాశ్రయాలు**
**గౌహతి, నవీ ముంబై ఎయిర్‌పోర్టులకు దక్కిన అరుదైన గౌరవం**
**ఆధునిక డిజైన్, సాంస్కృతిక వారసత్వానికి అంతర్జాతీయ గుర్తింపు**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)**

భారత విమానయాన రంగం అంతర్జాతీయ స్థాయిలో మరోసారి తన సత్తా చాటింది. దేశంలోని రెండు విమానాశ్రయాలు ప్రపంచంలోనే అత్యంత అందమైన ఎయిర్‌పోర్టుల జాబితాలో స్థానం సంపాదించుకున్నాయి. గౌహతిలోని లోక్‌ప్రియ గోపీనాథ్ బొర్దొలాయ్ 2లో

## ఉద్యోగులు, పింఛనుదారుల సమస్యలపై సంప్రదింపులకు సదా సిద్ధం: కేంద్ర మంత్రి



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)**

ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారుల సమస్యలపై సంప్రదింపులు, స్పందనతో కూడిన విధానాలద్వారా పరిష్కారానికి ప్రధాని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు కేంద్ర సిబ్బంది వ్యవహారాలశాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఆదివారం స్పష్టం చేశారు. పరిపాలనను మెరుగుపరచడం, విధానాల సరళీకరణ, పాలనా సామర్థ్యం పెంచడంవంటి సూచనలను ఎల్లప్పుడూ స్వాగతిస్తామన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్‌తోపాటు (బీఎంఎస్) అనుబంధ ఉద్యోగ సంఘాలకు చెందిన 19 మంది దేశవ్యాప్త ప్రతినిధుల బృందంతో సమావేశమైన సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రగతిశీల పాలనా సంస్కరణలద్వారా మరింత పారదర్శక, సమర్థమైన, పౌర కేంద్రిత సేవలు అందించడానికి ప్రధాని మోదీ ప్రాధాన్యం 2లో

## 'మావిగన్' గురించి జగన్ మాట్లాడాలనుకుంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి



**అమరావతిని రాజధానిగా కేంద్రం ప్రకటించిందన్న విష్ణుకుమార్ రాజు**
**జగన్ రాజకీయ కుట్రలు చేస్తున్నారని విమర్శ**
**సర్ పేరుతో ఓట్లు తొలగించడం లేదన్న బీజేపీ ఎమ్మెల్యే**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)**

ఏపీ రాజధానిగా అమరావతిని కేంద్రం ప్రకటించిన తర్వాత కూడా 'మావిగన్' అంటూ వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు విమర్శించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి మద్దతుగా మాట్లాడిన జగన్... 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు రాజధానులు అని 2లో



## జూలై 9న ఫైనల్ యాక్షన్: పాకిస్థాన్‌కు పీఓకే నేతల అల్టిమేటం

**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 06)**

పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో నిరసనలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే.. జులై 9న ఫైనల్ యాక్షన్‌ను ప్రారంభిస్తామని జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ పాక్ సర్కారుకు అల్టిమేటం ఇచ్చింది. తమ నిరసనల్లో భాగం కావాలని పీఓకే ప్రజలు, ప్రవాస కశ్మీరీలకు పిలుపునిచ్చింది. ఆ రోజున పీఓకేలో పర్యటించాలని ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్, ఐరాస ప్రతినిధులు, అంతర్జాతీయ మీడియా, మానవ హక్కుల సంఘాలను ఆహ్వానించింది. ఆ డెడ్‌లైన్ గడువు వరకు క్షమశిక్షణతో వ్యవహరించాలని తన మద్దతుదారులను 2లో

## ప్రశ్నించే గొంతుల్ని నొక్కడానికి.. పోలీసు వ్యవస్థను వాడుతున్నారు



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూలై 06)**

రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుల్ని నొక్కడానికి, రాజకీయ అణచివేతలకు చంద్రబాబు ప్రభుత్వం పోలీసుల్ని వాడుతోందని వైకాపా అధినేత జగన్ విమర్శించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గానికి చెందిన చిన్నారి జ్ఞానేశ్వరి కనిపించకుండా పోయి 30 రోజులు దాటినా ఆచూకీ కనిపెట్టలేదన్నారు. ఒక చిన్నారి ఆచూకీని కనుక్కోలేని ప్రభుత్వం.. ప్రజల భద్రతకు ఎలా భరోసా ఇవ్వగలుగుతుందని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. 'సాయికృష్ణ లాకప్‌డెత్, శవం మాయం చేసిన వ్యవహారంలో మృతుడి తల్లి 2లో




## నిషేధిత జాబితాలోని భూములకు విముక్తి కల్పించాలి

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)**

సీతాదేవిని రావణుడు లంకలో బంధించినట్లుగా.. రైతులు, పేదల భూములను ప్రభుత్వాలు 22ఏ పేరిట నిషేధిత జాబితాలో ఉంచాయని మాజీ ఐపీఎస్ అధికారి, సెంటర్ ఫర్ లిబర్టీ ఛైర్మన్ ఏబీ వెంకటేశ్వరరావు అభివర్ణించారు. సీతాదేవి లాంటి భూములను విడిపించుకోవడానికి పోరాటం చేయాల్సిందేనని, అందుకు బాధితులందరూ సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. తిరుపతిలోని రాస్ భవనం ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన ఆస్తిహక్కుల కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు హక్కులు కల్పించారు. 1971 నుంచి పాసుపుస్తకాలు, 2లో

## రామమందిరం ట్రస్ట్‌లో కీలక మార్పులు.. చంపత్‌రాయ్ స్థానంలో బజరంగ్ బగ్రా

**రామమందిరం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా బజరంగ్ బగ్రా నియామకం**
**చంపత్‌రాయ్ రాజీనామాకు ట్రస్ట్ ఆమోదం**
**విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో మార్పులు**
**అనిల్ మిశ్రా రాజీనామా కూడా ఆమోదం**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 06)**

అయోధ్య రామమందిరంలో భక్తుల విరాళాల చోరీపై దర్యాప్తు కొనసాగుతున్న వేళ శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ రాజీనామాను సోమవారం ఆమోదించింది. ఆయన స్థానంలో బజరంగ్ బగ్రాకు బాధ్యతలు అప్పగించినట్లు ట్రస్ట్ వర్గాలు తెలిపాయి.దేవాలయ విరాళాల్లో అవినీతి కేసులో దర్యాప్తు వేగం పుంజుకున్న నేపథ్యంలో జూన్ 26న చంపత్‌రాయ్ 2లో

# ఆర్టీజీ కేంద్రం నుంచి ఇక 24 గంటల సేవలు...

చూపుతూ, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వివిధ ప్రభుత్వ విభాగాలు ఎంత తక్షణమే సమన్వయంతో స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం మధ్య సమన్వయం కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఆధ్వర్యంలో తరచూ మల్టీ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేషన్ సమావేశాలు జరగాలని సూచించారు. ఆర్టీజీ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని నిర్దేశించారు.

"ఏఐ మెథడాలజీ ద్వారా చిత్తూరు జిల్లాలో సంతృప్తి స్థాయి నమోదు చేస్తున్నాం. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయడం వల్ల ప్రజాభిప్రాయం నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. నియోజకవర్గ స్థాయిలో 'లాస్ట్ మైల్ గవర్నెన్స్' ప్రజలకు అందాలి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్‌మెంట్, బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలి," అని ముఖ్యమంత్రి విశ్లేషించారు.

**పీజీఆర్ఎస్ పరిష్కారానికి యాక్షన్ ప్లాన్**

పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సీఎం చంద్రబాబు గట్టిగా ఆదేశించారు. వివిధ కేటగిరీలు, శాఖలకు చెందిన పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఒక పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆర్థిక, ఆర్థికేతర అంశాలుగా విభజించి, ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారం చూపాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

**పట్టణాల్లో 'జీరో వేస్ట్' లక్ష్యం**

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పేరుకుపోయిన 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రాబోయే మూడు నెలల్లోగా యుద్ధప్రాతిపదికన తొలగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో 'జీరో వేస్ట్' సాధించడమే మన లక్ష్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బృహత్కార్యంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములై శ్రద్ధ పెట్టాలని కోరారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ వంటి కార్యక్రమాలపై నిర్దిష్ట ప్రామాణిక కార్యాచరణ విధానం జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

**గంజాయిపై ఉక్కుపాదం.. భద్రతకు పెద్దపీట**

రాష్ట్రంలో గంజాయి ముఠాలను పూర్తిగా నియంత్రించాలని, వాటిపై ఉక్కుపాదం మోపాలని హోం శాఖ అధికారులకు సీఎం నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వం 'డ్రగ్ ఫ్రీ కంట్రీ' లక్ష్యంతో పనిచేస్తోందని, దానికి అనుగుణంగా రాష్ట్రంలో గంజాయి నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యల సమాచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అదే సమయంలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాలని, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కూడా సూచించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల ద్వారా ఎలాంటి ఫలితాలు సాధిస్తున్నామో ఎప్పటికప్పుడు విశ్లేషించుకోవాలని, పాలనలో పొదుపు మంత్రాన్ని పాటించాలని అధికారులకు హితవు పలికారు. మారుమూల ప్రాంతాల్లో కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కనెక్టివిటీ కోసం టవర్లను ఏర్పాటు చేసేందుకు టెలికాం ఆపరేటర్లతో మాట్లాడి కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, పురపాలక, ఎక్సైజ్, పోలీసు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రావణ్‌తో వైసీపీకి ఎలాంటి సంబంధాలు లేవు

అందుకే దౌర్జన్యంగా ప్రవర్తించిన ఏపీ పోలీసులపై ఏకంగా తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో సోషల్ మీడియాపై అధికారిక దౌర్జన్యకాండ సాగుతోందని అంబటి విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే కొందరు వ్యక్తులు అత్యంత అసభ్య పదజాలంతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నా... వారిపై పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, చట్టం అందరికీ ఒకేలా ఎందుకు వర్తించడం లేదని నిలదీశారు.

## ప్రపంచంలోనే అత్యంత అందమైన ఎయిర్‌పోర్టులు... జాబితాలో రెండు భారత విమానాశ్రయాలు

అంతర్జాతీయ విమానాశ్రయం (టెర్మినల్-2), నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం (టెర్మినల్-1) ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నాయి. ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఆర్కిటెక్చర్, డిజైన్ అవార్డు అయిన 'ప్రిక్స్ వెర్సైల్స్ 2026' తాజాగా ఈ జాబితాను విడుదల చేసింది. పారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో ప్రకటించే ఈ పురస్కారం, ప్రపంచవ్యాప్తంగా కొత్తగా నిర్మించిన లేదా ఆధునికీకరించిన విమానాశ్రయాలను గుర్తిస్తుంది. ఆధునిక డిజైన్, పర్యావరణ హిత నిర్మాణం, సాంస్కృతిక గుర్తింపు, ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని అందించే అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ ఎంపిక చేపడతారు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా మొత్తం ఏడు విమానాశ్రయాలు ఈ

**మొదటి పేజీ తరువాయి**

ప్రతిష్ఠాత్మక జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

గౌహతిలోని టెర్మినల్-2ను ఈశాన్య భారతానికి ప్రత్యేకమైన 'వెదురు ఆర్కిడ్' పుష్పాల స్ఫూర్తితో నిర్మించారు. టెర్మినల్ లోపల 'ఇండోర్ స్కై ఫారెస్ట్', అస్సామీ సంప్రదాయ హస్తకళల మేళవింపుతో దీనికి రూపకల్పన చేశారు. ఇక, అదానీ గ్రూప్ ఆధ్వర్యంలోని నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్-1ను 'కమలం' ఆకృతిలో నిర్మించారు. సహజ సిద్ధమైన వెలుతురు, గాలి ప్రసరణకు పెద్దపీట వేస్తూ, ఇంధన వినియోగాన్ని తగ్గించేలా దీన్ని అద్భుతంగా డిజైన్ చేశారు.

ఈ జాబితాలో భారత్‌తో పాటు చైనాలోని గ్వాంగ్‌జౌ, జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్, అమెరికాలోని పిట్స్‌బర్గ్, శాన్ డియాగో విమానాశ్రయాలు కూడా ఉన్నాయి. విమానాశ్రయాలను కేవలం రవాణా కేంద్రాలుగానే కాకుండా, అద్భుతమైన సాంస్కృతిక చిహ్నాలుగా తీర్చిదిద్దడంలో భారత్ అగ్రగామిగా నిలుస్తోందని ఈ అంతర్జాతీయ గుర్తింపు చాటిచెబుతోంది.

# ఉద్యోగులు, పింఛనుదారుల సమస్యలపై సంప్రదింపులకు సదా సిద్ధం: కేంద్ర మంత్రి

ఇస్తారన్నారు. ఉద్యోగ సంఘాలతో జరిపే నిరంతర సంప్రదింపులు విస్తృత ప్రజా ప్రయోజనం కలిగిన ఆచరణాత్మక సమస్యలను గుర్తించడంలో, తగిన విధానపరమైన పరిష్కారాలను చూపడంలో కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల కేంద్రీకృత కార్యక్రమాలను సులభతరం చేసినందుకు ప్రతినిధి బృందం మంత్రికి కృతజ్ఞతలు తెలిపింది. మరీ ముఖ్యంగా దాదాపు 65,000 మంది ఆయుధ కర్మాగార మాజీ ఉద్యోగులను తిరిగి ప్రభుత్వ సేవలోకి తీసుకోవాలనే నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.

## 'మావిగన్' గురించి జగన్ మాట్లాడాలనుకుంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి

మాట మార్చారని మండిపడ్డారు. అమరావతే రాజధాని అని అన్ని పార్టీలు ఒప్పుకున్న తర్వాత కూడా జగన్ రాజకీయ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తుండటం చూడలేక జగన్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విష్ణుకుమార్ రాజు అన్నారు. మావిగన్ గురించి మాట్లాడాలనుకుంటే... అసెంబ్లీలో చర్చించాలని, బయట ప్రెస్ మీట్లు పెట్టడం సరికాదని సూచించారు. రుషికొండ భవనాలను ప్రజలందరికీ ఉపయోగపడేలా వినియోగించాలని చెప్పారు. 'సర్' పేరుతో ఎవరి ఓట్లు తొలగించడం లేదని అన్నారు.

## ప్రశ్నించే గొంతుల్ని నొక్కడానికి.. పోలీసు వ్యవస్థను వాడుతున్నారు

అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం దగ్గర సమాధానాలు లేవు. క్రాంతికుమార్ ఆత్మహత్య, అతని మరణ వాంగ్మూలాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా చూసిన ప్రజలు కలత చెందారు. గంగమ్మ, తిరుపతమ్మ లాకప్‌డెత్‌లు, పోలీసుల వేధింపులతో కళావతి ఆత్మహత్య ఘటన.. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థకు తీవ్ర తలవంపులు తెచ్చాయి. నెల్లూరు జిల్లా కావలిలో తెదేపా మాజీ కౌన్సిలర్ ఓ గిరిజన మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడ్డారు. ఈ తరహా ఘటనల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే యూట్యూబర్ రావణ్‌ను కేసుల్లో ఇరికించి వేధిస్తున్నారు' అని జగన్ విమర్శించారు.

## నిషేధిత జాబితాలోని భూములకు విముక్తి కల్పించాలి

అడంగళ్లు, 1-బీలు వచ్చాయి. వాటిని బ్యాంకుల్లో పెట్టి రైతులు అప్పులు తెచ్చుకున్నారు. కట్నాలుగా ఇచ్చారు. పిల్లలకు రాసిచ్చారు. ఇలాంటి వాటిని ప్రభుత్వ భూములుగా చూపించి 22ఏ నిషేధిత జాబితాలో ఉంచడం సరికాదు. నోటీసులు ఇవ్వకుండా, ఎవరికీ తెలియకుండా నిషేధిత జాబితాలో ఉంచిన వాటిని తిరిగి వారికే చెందేలా చూడాలి' అని డిమాండ్ చేశారు. అనంతరం బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సెంటర్ ఫర్ లిబర్టీ ప్రతినిధి నలమోతు చక్రవర్తి, డా.సిరిగిరిబాబు, ఎస్.పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రామమందిరం ట్రస్ట్‌లో కీలక మార్పులు.. చంపత్‌రాయ్ స్థానంలో బజరంగ్ బగ్రా

తన పదవికి రాజీనామా చేశారు. అంతకుముందు ఆయన డ్రైవర్ రామశంకర్ యాదవ్ అలియాస్ టిన్నూతో పాటు మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా కూడా రాజీనామా చేశారు. అయితే ఇప్పటివరకు చంపత్‌రాయ్ లేదా అనిల్ మిశ్రాపై ఎలాంటి క్రిమినల్ కేసు నమోదు కాలేదు. రామమందిర ప్రాంగణంలో సోమవారం జరిగిన ట్రస్ట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. చంపత్‌రాయ్ ఆలయ ప్రాంగణంలో ఉన్నప్పటికీ సమావేశానికి హాజరు కాలేదని సమాచారం. 2020లో ట్రస్ట్ ఏర్పడిన తర్వాత ఇది అత్యంత కీలక సమావేశంగా భావిస్తున్నారు. ట్రస్ట్ ట్రెజరరీ స్వామి గోవింద్ దేవ్ గిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్ దాస్ హాజరయ్యారు. సమావేశంలో విరాళాల దుర్వినియోగంపై సిట్ మధ్యంతర నివేదిక, ఆలయ భవిష్యత్ పాలనా విధానం, సీఈఓ నియామకం, 2025-26 ఆర్థిక లెక్కల ఆమోదం వంటి అంశాలపై చర్చించారు.

ఇక విరాళాల దుర్వినియోగంపై సిట్, పోలీసులు సమాంతరంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చంపత్‌రాయ్, అనిల్ మిశ్రా, గోపాల్‌రావు వాంగ్మూలాలు నమోదు చేసినప్పటికీ, వారిపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు.

**బజరంగ్ బాగ్రా ఎవరు?**

బజరంగ్ బాగ్రా రాజస్థాన్‌లోని సికార్‌కు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్. ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో) ఛైర్మన్-కమ్-మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా పనిచేశారు. అంతకుముందు నాల్కో, రైట్స్ లిమిటెడ్‌లో డైరెక్టర్ (ఫైనాన్స్), చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) బాధ్యతలు నిర్వహించారు. స్వచ్ఛంద పదవీ విరమణ తర్వాత విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ)లో పూర్తికాల కార్యకర్తగా చేరి, ప్రస్తుతం అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆర్థిక నిర్వహణ, సంస్థాగత పరిపాలనలో ఆయనకు ఉన్న అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ కొత్త ప్రధాన కార్యదర్శిగా నియమించింది.

# దక్షిణ కొరియాలో వివిధ సంస్థల ప్రతినిధులతో మంత్రి నారా లోకేశ్ భేటీ

భాగస్వామ్యం కుదుర్చుకుని.. డిస్‌ప్లే తయారీదారుల కోసం ఏపీలో మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే-మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత సియోల్ బిజినెస్ ఏజెన్సీ కొరియన్ స్టార్టప్ ఫౌండర్లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా "వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్" నినాదంతో ఐదేళ్లలో 20వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలను సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. భారతదేశ ఏఐ రాజధానిగా ఏపీని నిలపడమే తమ ధ్యేయమని చెప్పారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లోకి కొరియన్ స్టార్టప్‌లకు ఈ సందర్భంగా మంత్రి ఆహ్వానం పలికారు. ఆ తర్వాత హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ పవర్ సిస్టమ్స్ ప్రెసిడెంట్ యోకోటా తకేషితో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాల కోసం తిరుపతి లేదా శ్రీసిటీ సమీపంలో స్విచ్‌గేర్లు, ఇతర విద్యుత్ పరికరాల తయారీ, అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. అనంతరం సియోల్ సెమీ కండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ తాయెహ్యూంగ్ లీతో మంత్రి భేటీ అయ్యారు. శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో సియోల్ సెమీ కండక్టర్స్ సంస్థ డిస్‌ప్లే ఫ్యాబ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

## జులై 9న ఫైనల్ యాక్షన్: పాకిస్థాన్‌కు పీఓకే నేతల అల్టిమేటం

కోరింది. పాక్ ప్రభుత్వ అణచివేతలు, పౌరుల హత్యలను అంతర్జాతీయ సమాజం గమనించాలని జేఏఏసీ అభ్యర్థించింది. నిరసల్లో భాగంగా ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించింది. సమాచార వ్యవస్థను పునరుద్ధరించాలని, ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవద్దని, నిర్బంధంలో ఉన్న తమ నాయకులను విడిచిపెట్టాలని, 38 పాయింట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని జేఏఏసీ డిమాండ్ చేస్తోంది. ప్రజల డిమాండ్లకు తూటాలతో స్పందిస్తే.. తమకు ఇతర మార్గాలు ఉన్నాయని పాక్ ప్రభుత్వాన్ని మరోసారి హెచ్చరించింది.

**భారత్ సహాయం కావాలి..**

కాగా.. జేఏఏసీ నేత సర్దార్ అమన్ ఖాన్ మాట్లాడినట్లు ఉన్న ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. "మాకు భారత్ సహాయం కావాలి. ఆహారపదార్థాలు, నిత్యావసరాల కొరత ఉంది. మానవతా సాయం అందించండి" అని ఆయన కోరినట్టుగా ఆ వీడియోలో ఉండటం గమనార్హం. నిరసనలను కఠినంగా అణచివేస్తోన్న పాక్.. ఆర్థిక దిగ్బంధనాన్ని విధించిదని అందులో ఆరోపించారు. పరిస్థితులు మరింత దిగజారితే పౌరులు భారత్‌కు వచ్చేందుకు వీలుగా నియంత్రణ రేఖ వెంట సరిహద్దును తెరవాలని అమన్ ఖాన్ విజ్ఞప్తి చేశారు. గత కొన్నిరోజులుగా పీఓకేలో పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆందోళనలకు మద్దతు ఇస్తున్న జేఏఏసీని పాక్ ప్రభుత్వం ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద నిషేధించింది. ఈ కమిటీకి చెందిన 600 మంది నాయకులు, కార్యకర్తలను భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. నిరసనకారులను అణచివేయడానికి పీఓకేలోకి వెళ్తున్న నిత్యావసర సరకులు, ఆహార పదార్థాలు, అత్యవసర మందులను ప్రభుత్వం అడ్డుకుంది.

# ఓటర్ల జాబితా సవరణలో నిర్లక్ష్యం వద్దు

### నిర్ణీత గడువులోగా ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తి చేయాలి

### తహసీల్దార్ మల్లిఖార్జున నాయుడు



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జులై 6)** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని పుల్లలచెరువు తహసీల్దార్ నలగాటి మల్లిఖార్జున నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా బీఎల్‌వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సోమవారం మండలంలోని స్వర్ణ గ్రామం--2లో తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు చేపడుతున్న ఇంటింటి సర్వే, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బీఎల్‌వోలకు ఆదేశించారు. ప్రత్యేక సవరణ ప్రక్రియలో నిర్లక్ష్యానికి ఆస్కారం లేకుండా నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఓటర్ల జాబితా సవరణపై అవగాహన కల్పిస్తూ, దరఖాస్తులను సకాలంలో స్వీకరించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమైనదని, ప్రతి వివరాన్ని నిశితంగా పరిశీలించి నమోదు చేయాలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో బీఎల్‌వోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సంబందిత సిబ్బంది పాల్గొన్నారు.

# జూలై 8 నుండి పద్మాల అంకమ్మతల్లి ప్రతిష్టా

**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 6)**

చిన్నగంజాం మండలంలోని మున్నంవారిపాలెం గ్రామం నందు నూతనంగా నిర్మించిన పద్మాల అంకమ్మ తల్లి అమ్మవారి యొక్క ప్రతిష్టా ,కొలుపులు కార్యక్రమం జూలై 8 నుండి 12 వరకు నిర్వహించనున్నట్లు అలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వివరాలు తెలియజేస్తూ జూలై 8 నుండి ప్రారంభించనున్న ప్రతిష్టా కార్యక్రమంలో 9జూలై గురువారం ఉదయం 6:41 నిమిషాలకు వేదిక పండితుల అధ్వర్యంలో శ్రీ అంకమ్మతల్లి అమ్మవారి ప్రతిష్ట నిర్వహించనున్నారు. అనంతరం జూలై 10 నుండి 12 వరకు అమ్మవారి యొక్క కొలుపులు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. 9 జూలై అమ్మవారి ప్రతిష్టా సందర్భంగా మహా అన్నదానం సాయంత్రం గొప్ప కోలాటం నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ, మండల భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారి యొక్క ప్రతిష్ట, కొలుపులు కార్యక్రమంలో పాల్గొనాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేసారు.

# గుడ్లూరులో కాకు వారి నాగర్పమ్మ కొలుపులు





**(షణ్ముఖ వెలుగు, గుడ్లూరు, జులై 6)** గుడ్లూరులో కాకు వారి నాగర్పమ్మ కొలుపులు సోమవారం జరిగాయి. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు హాజరై, నాగర్పమ్మకు పూజలు చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన అందరిని ఎమ్మెల్యే పలకరిస్తూ, వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, స్వర్ణాజీపురం గ్రామ టిడిపి అధ్యక్షుడు కాకు దత్తాత్రేయ, పార్టీ సీనియర్ నాయకులు కాకు నాగేశ్వరరావు, చిత్తూరు మల్లికార్జున, మేకల మాల్యాద్రి, చెన్నారెడ్డి మహేష్, మద్దసాని కృష్ణ, కాకు మనోజ్ రాజా, మాధవ, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, గొడ్డేటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్టుకార్డులు పోయినవి

నేను మార్కాపురం జిల్లా పిసిపల్లి మండలం, పెద ఇర్లపాడు గ్రామంలో నివసిస్తున్నాను. నేను **23.06.2026**న పెద ఇర్లపాడు నుండి పెద అలవలపాడు గ్రామానికి బైక్ పై వెళుతుండగా పర్స్‌పోయినది. ఆ పర్సులో ఎక్స్ ఆర్మీనైన నాకు చెందిన రెండు స్మార్ట్ కార్డులు, ఒక హెల్త్ కార్డు పోయినవి. కావున సదరు కార్డులు ఎవరికైనా దొరికినట్లైతే వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
రాచమళ్ళ చెన్నయ్య
తండ్రి చిన అంకయ్య
డోర్ నెం. 11/24
పెద ఇర్లపాడు, పిసిపల్లి మండలం,
మార్కాపురం జిల్లా
సెల్ నెంబర్ : 9493606076
ఆధార్ నెంబర్ : (2212 7680 5954)







ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

07.07.26 మంగళవారం


## మార్కాపురం జిల్లా ఓఎస్‌డిగా నవజ్యోతి మిశ్రా



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూలై 6)
నూతన మార్కాపురం జిల్లా ఓఎస్‌డిగా నవజ్యోతి మిశ్రా (ఐపిఎస్) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ నుండి అధికారికంగా సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన గతంలో చింతపల్లి ఏఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు.

## ఏ ఒక్కరూ ఓటు హక్కును కోల్పోవద్దు

**జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత**



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూలై 6)
ఏ ఒక్కరు కూడా మీ ఓటు హక్కును కోల్పోవద్దని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. ప్రతి ఒక్క ఓటరు మీ ఓటు హక్కును పరిశీలించుకునేందకు బిఎల్వోలకు సహకరించాలని సూచించారు. సోమవారం సాయంత్రం నగరపంచాయతీలోని పోతవరం, విరాట్ నగర్, మాదిరెడ్డిపాలెం గ్రామాల్లో సర్ కార్యక్రమం పై ప్రత్యేక పరిశీలన చేశారు. అనంతరం ఆమె సర్ కార్యక్రమం జరుగుతున్న తీరును బిఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. ఫారాలు ఇచ్చిన కూడా ప్రజలు సకరించడం లేదని పలుమార్లు ఇళ్లకు వెళ్లిన ఫోటోలు ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రెండురోజుల్లో పూర్తిస్థాయిలో పూర్తి చేస్తామని వారు కలెక్టర్‌కు తెలిపారు. స్పందించిన ఆమె ప్రజలతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటును సవరణ చేసేందకు మీ ఇంటికి అధికారులు (తరువాయి 4లో...)

# తల్లేమో చేదు....!
# ఆస్తేమే తీపి....!

**కరోనాతో భర్త మృతి....**
**కొడుకు నిర్వాకంతో తల్లి అతలాకుతలం**
**అమ్మకు దక్కాల్సిన రూ.14 వేల అద్దె కూడా**
**రెండు నెలలుగా ఇవ్వని వైనం**
**తల్లి, అక్కలకు తెలియకుండానే మున్సిపాలిటీలో ఇంటి పేరిట ఉన్న పన్ను తన పేరున మార్చుకున్న పరిస్థితి**
**న్యాయం చేయాలంటూ కలెక్టర్‌కు బాధితురాలి కన్నీటి అర్జీ**

## వృద్ధాప్యంలో కన్నతల్లిని చూడని కొడుకు..!!



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూలై 6)
నవమాసాలు మోసి రక్తాన్ని పాలుగా మార్చి పెంచిన ఆ తల్లి ఏమో ఆ కుమారుడికి కటిక చేదు....అదే తల్లిదండ్రులు సంపాదించిన పెట్టుకున్న ఆస్థి మాత్రం తీపిగా కనిపిస్తుంది. తల్లిదండ్రులను చూడకపోతే ఆస్తి ఇవ్వకూడదని కోర్టులు కొత్త చట్టాలు తీసుకు వచ్చినా అవేమీ పట్టించుకోని కన్న కొడుకు ఇలా 67 ఏళ్ళ వయస్సు కల్గిన కన్నతల్లిని వదిలేశాడనే చెప్పవచ్చు. వృద్ధాప్యంలో కొడుకు అండగా ఉంటాడని ఆశించింది. కానీ ఆ కన్నకొడుకే తల్లి అంటే కనీస కనికరం లేకుండా పోయింది. నవమాసాలు పెంచి పోషించదన్న కనీస కృతజ్ఞత కూడా లేదు. ఆస్తి వ్యామోహంతో కన్నతల్లిని కంటిపాపలా చూసుకోవాల్సింది పోయి, ఆమె నోట్లోకి నాలుగు మెతుకులు కూడా పోకూడదనుకున్నాడు. అనారోగ్య కారణంతో తాను అద్దెకు ఉంటున్న ఇంటి అద్దె చెల్లించలేక నరకయాతన అనుభవిస్తున్న ఆ వృద్ధురాలు నన్ను బతకనివ్వు నాయనా అంటూ విలపిస్తోంది. సోమవారం మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు బాధితురాలు కొత్తూరి ఉమాదేవి కలిసి తన సమస్యను కన్నీటి పర్యంతమై మొరపెట్టుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం పొదిలి తహశీల్దార్ కార్యాలయం వీధిలో ఉమాదేవి ఒక అద్దె ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నారు. గతంలో ఆమెకు, ఆమె భర్తకు ఒంగోలు-కర్నూలు రోడ్డులో ఒక ఇంటిలో షాపు ఉండేది. ఇల్లు పాతది కావడంతో పిల్లల పెళ్లిళ్ల నిమిత్తం వారు అద్దె ఇంట్లోకి మారారు. అయితే 2021లో కరోనా మహమ్మారి బారిన పడి ఆమె భర్త మరణించారు. అప్పటి నుండి ఉమాదేవి జీవితం తలకిందులైంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త చనిపోయినప్పటి నుండి కొడుకు సురేష్ ఆమెను పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. పైగా వృద్ధురాలైన తల్లికి సపర్యలు చేయడానికి వచ్చే అక్కాచెల్లెళ్లను ఆస్తుల కోసమే వస్తున్నారా అంటూ దుర్భాషలాడుతూ మానసిక వేధనకు గురిచేసేవాడు. కొడుకు వేధింపులు తట్టుకోలేక, భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. దీంతో గత నెలలో పొదిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీస్ స్టేషన్‌కు తనను పిలిపిస్తావా అంటూ మండిపడ్డ కుమారుడు సురేష్ గత నెలలో అద్దె రూ.14,000 ఇవ్వకుండా అతని మామ తీసుకుని వెళ్ళిపోయాడు. దీంతో ఆమె ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోకి వెళ్ళింది. అయినా కూతుర్ల సహాయంతో ఒక నెల నెట్టుకొచ్చింది. రెండో నెల అద్దె అయినా కుమారుడు అందించకపోతాడా అని ఆశగా ఎదురు చూసింది. ఆమె ఎదురుచూపులకు నిరాశే ఎదురైంది. ఈ నెల 4వ తేదీ సాయంత్ర ఉమాదేవి షాపు వద్దకు వెళ్ళి షాపు నిర్వాహకుడిని అద్దె ఇవ్వాలని అడిగింది. దీంతో షాపు నిర్వహకుడు మీ కుమారుడు అద్దె తనకే ఇవ్వాలని కోరాడని, తాను మీకు ఇవ్వలేనని తెగేసి చెప్పాడు. దీంతో ఆమె అక్కడ నుంచే కుమారుడికి ఫోన్ చేసింది. ఆమె కోడలు ఫోన్ ఎత్తి మేము ఇల్లు బాగు చేయడానికి డబ్బులు ఖర్చు పెట్టాం, నీకు అద్దె ఇక నుంచి ఇవ్వలేము...మేమే తీసుకుంటామంటూ స్పష్టంగా చెప్పి ఫోన్ కట్ చేశారు. ప్రస్తుతం తాను ఉన్న ఇంటి అద్దె కూడా కట్టలేక తినడానికి తిండి లేక నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చింది. కట్టుకున్న భర్త చనిపోయి కన్నా కొడుకు మోసం చేయడంతో గుండె పగిలిపోయేలా పగలేలా విలపిస్తోంది. దీంతో గత్యంతరం లేక సోమవారం మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వెళ్లి తనకు ఆరోగ్యం సహకరించడం లేదని మందులకు, ప్రస్తుతం ఉంటున్న ఇంటి అద్దె చెల్లించేందుకు డబ్బులు లేక నానా అవస్థలు పడుతున్నానని ఉమాదేవి జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులుకు తన ఆవేదనను తెలిపింది. తాను బతికున్నంత కాలం తన భర్త ఆస్తి పై వచ్చే అద్దె డబ్బులు తనకు ఇప్పించాలని వేడుకున్నారు. ఆర్డీఓను ఈమె విషయం పై విచారంచి ఆమెకు తగిన న్యాయం చేయాలని ఆదేశించారు.

## ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీసీ కెమెరాలను పరిశీలించిన మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు

**సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చు**



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూలై 6)
మార్కాపురంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో మొత్తం 16 హై రిజల్యూషన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కెమెరాల ద్వారా బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో జరిగే బ్యాగుల దొంగతనాలు, ద్విచక్ర వాహనాల చోరీలు, మొబైల్ ఫోన్ చోరీలు తదితర నేరాలను వేగంగా గుర్తించి, నిందితులను గుర్తించడంతో పాటు దొంగిలించబడిన వస్తువులను రికవరీ చేయడంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు నేరాల నియంత్రణ, నేరాల ఛేదనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలు కూడా తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, ప్రజల భద్రత కోసం సీసీ కెమెరా వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద కదలికలు గుర్తించిన వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవి నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కాపురంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపిన మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు, మార్కాపురం సీఐ అల్తాఫ్ హుస్సేన్, మార్కాపురం పట్టణ, రూరల్ ఎస్ఐలు విశ్వనాథరెడ్డి, వి వేమనలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



## ప్రకాశం జిల్లా డిపిఆర్‌ఓగా రవికుమార్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూలై 6)
ప్రకాశం జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్‌ఓ)గా ఎస్ రవికుమార్ నియమితులయ్యారు. సోమవారం జిల్లా కలెక్టర్ పి రాజాబాబును ఆయన ప్రకాశం భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులో డివిజనల్ పీఆర్వోగా బాధ్యతలు నిర్వహిస్తున్న రవికుమార్ పదోన్నతి పొంది డిపిఆర్‌ఓగా ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ ఆయనకు సూచించారు. జిల్లా యంత్రాంగానికి, మీడియాకు మధ్య వారధిగా సమర్థంగా పనిచేస్తానని రవికుమార్ తెలిపారు. నూతన డిపిఆర్వోగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌కు సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## శాఖలు సమన్వయంతో పని చేయాలి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూలై 6)
కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. విబిజి రాంజీ పథకం కింద కేటాయించిన నిధులతో జిల్లాలో చేపట్టాల్సిన పనుల పై సోమవారం ప్రకాశం భవనంలో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జలధార – జలహారతి, పొలాలలో ఇంకుడు గుంటలు, పశువుల షెడ్లు, ఇళ్లల్లో మురుగునీరు ఇంకుడు గుంటలు, సేంద్రీయ నిల్వలు, పంచాయతీరాజ్ రోడ్లు, మ్యాజిక్ డ్రైనేజీలు, ఇళ్ళ నిర్మాణంలో 90 పని దినాలు, ఉద్యానవనం, అటవీ, ప్రభుత్వ విద్యాలయాల్లో నెట్ జీరో హెల్ది క్యాంపస్ కార్యక్రమం కింద మొక్కలు నాటడం పై ఈ సందర్భంగా ▶మిగతా 4లో

## శాఖలు సమన్వయంతో పని చేయాలి

కలెక్టర్ చర్చించారు. వివిజి రాంజీ పథక నిధులతో క్షేత్రస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలకు, నివాస కాలనీలకు, స్మశానాలకు రోడ్లు వేయటంపై దృష్టి పెట్టాలన్నారు. రైతులకు మరింత ఆదాయం వచ్చేలా అంతర పంటల సాగుకు అవసరమైన సహాయాన్ని ఈ పథకం కింద అందించాలన్నారు. పాఠశాలలు, బీచ్ లో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ' పల్లెనిద్ర ' కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ఈ పథకం కింద అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆయన దిశ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డ్వామా పిడి జోసఫ్ కుమార్, డీఎఫ్‌వోలు రాజశేఖర్, వినోద్ కుమార్, వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖ జేడీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, డిపిఓ అనుపమ, జడ్పీ సీఈవో చిరంజీవి, పంచాయతీరాజ్ ఎస్.ఈ. అశోక్, డీఈవో రేణుక, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, భూగర్భ నీటి వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, ఉద్యాన శాఖ ఏడి గోపీచంద్, సెరికల్చర్ అధికారి సుజన్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ సేవలు చిరస్మరణీయం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 6)

అణగారిన వర్గాల అభివృద్ధి కోసం అలుపెరుగని కృషి చేసిన మహనీయుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని దళిత నాయకులు అన్నారు. సోమవారం ఆయన 40వ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఏబిఎం స్కూల్ ఆవరణలోని ఆయన విగ్రహానికిపూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడిగా, సంఘసంస్కర్తగా, రాజకీయ నాయకుడిగా దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఎంఆర్‌పిఎస్ నాయుకులు వేల్పుల సురేష్, బుదాలా బెంజిమెన్, అప్రెస్ చైతన్య, ఐజాక్, శ్యామ్, చిరంజీవి, ఎలీషా, అజయ్, ఆరోన్, అరుణ్, నాసరబాబు, జోసెఫ్ పాల్గొని నివాళులర్పించారు.

## ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల






(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 6)

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ, పట్టణ ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే కి విన్నవించారు. అందులో కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించగా, మిగిలిన సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దూర ప్రాంతాల వారిని ఉద్దేశించి వారి వద్దకే అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేలా కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి పేద ప్రజలకు అన్ని విధాలుగా సహకారం అందించేందుకు కట్టుబడి ఉన్నారన్నారు. "ప్రజల వద్దకే పాలన" అనే ఉద్దేశంతో నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, పట్టణ నాయకులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొని అర్జీలు స్వీకరించారు.

# ఏ ఒక్కరూ ఓటు హక్కును కోల్పోవద్దు

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

వస్తున్నారని, ఈ అవకావాన్ని ప్రజలు వినియోగించుకుని ఓటు సవరణ చేసుకోవాలని సూచించారు. ఇప్పుడు జరుగుతున్న కార్యక్రమంలో పూర్తి వికురాలు ఇవ్వకుండా ఓటు హక్కు కోల్పోయి ఈనెల 21న వచ్చే కొత్త ఓటరు జాబితాలో ఓటు లేకపోతే దాన్ని మళ్లీ సాధించుకునేందకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కనుక ప్రతి ఒక్కరు బిల్వోలు ఇచ్చిన ఫారాలను పూర్తి చేసి అడిగిన సమాచారం అందించి ఓటును పొందాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీవో వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ క్రిష్ణారెడ్డి, నగరపంచాయతీ కమీషనర్ అంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ శోభన్‌బాబు, ఇతర అధికారులు, రెవిన్యూ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.









# డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి యాజమాన్యం

### అందిస్తున్న ఉచిత సేవలు అభినందనీయం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 6)

డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి యాజమాన్యం అందిస్తున్న ఉచిత సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించేలా సోమవారం కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన ఉచిత కంటి పరీక్షల స్క్రీనింగ్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలను తాము నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా కలెక్టరేట్లో కూడా ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. ప్రజలకు, ఉద్యోగులకు ఉచితముగా కంటి పరీక్షలు చేస్తున్నామని వారు చెప్పారు. సర్జరీ అవసరమైన వారికి ఈహెచ్ఎస్, ఇన్సూరెన్స్, టీపీఎస్, ఎన్టీఆర్ వైద్య సేవ పథకాల్లో నిర్వహిస్తున్నామని వివరించారు. వీరు అందిస్తున్న సేవలను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. తన కళ్ళకు కూడా పరీక్షలు చేయించుకున్నారు. జిల్లాలోని పాఠశాలల్లో కూడా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు కళ్ళ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పి వెంకటరమణ, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, అగర్వాల్ కంటి ఆసుపత్రి మేనేజర్ రజనీకాంత్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సాయి యశ్వంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# ఫిర్యాదులను అత్యధిక ప్రాధాన్యతతో నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో పరిష్కరించాలి

### జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 6)

వైఎస్ఆర్ కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పాల్గొని జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యల పై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 141 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమానికి విచ్చేసిన వృద్ధులు, దివ్యాంగుల వద్దకే జిల్లా ఎస్పీ వెళ్లి ఫిర్యాదు లను స్వీకరించారు. చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. పోలీస్ శాఖ ద్వారా పరిష్కారం అయ్యే ప్రతి ఫిర్యాదును ప్రజలు స్వేచ్ఛగా తమ దృష్టికి తీసుకురావాలని కోరుతున్నామన్నారు. ప్రజల నుండి అందిన సదరు ఫిర్యాదులను నిర్ణీత సమయంలో చట్ట పరిధిలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యల పై ప్రజలు తమ వినతులను విన్నవించుకున్నారు. వాటి పై సంబంధిత పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ ఎన్ సుధాకర్, డిటిసి డిఎస్పీ అబ్దుల్ కరీం, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.







## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 6)

ఘనంగా నివాళులర్పించిన ప్రకాశం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖభారత దేశ నిర్మాణంలో అగ్రగామిగా, దళితోద్ధారకులుగా మరియు అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి వేడుకలు, ప్రకాశం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మా నాయక్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మా నాయక్, ఇతర ముఖ్య అతిథులు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. సుమారు 30 ఏళ్లకు పైగా కేంద్ర మంత్రిగా పని చేస్తూ, భారత రాజ్యాంగ నిర్మాణంలో, సామాజిక సమత్వం కోసం ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేశారు. ఆయన చూపిన బాటలో నడవాలని, సామాజిక సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ సూపరింటెండెంట్లు మధుసూదన్‌రెడ్డి, మాల్యాద్రి, అధ్యక్షులు అంకబాబు, జిల్లా అధ్యక్షులు టి ఆనంద్, టౌన్ అధ్యక్షులు ప్రభుదాస్, టి బాబు, ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షులు జె ఆంజనేయులు, రాష్ట్ర డప్పు కళాకారుల అధ్యక్షులు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఇతర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం చేయాలి

### యాదవ జేఏసీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 6)

ఉలవపాడు ప్రజా వైద్యశాల ఆస్పత్రిలో ఈ నెల 4వ తేదీన కందుకూరు గ్రామానికి చెందిన బక్కమంతుల పెద్ద బ్రహ్మయ్య అను యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మృతి చెందిన ఘటనపై ఉన్నత స్థాయి విచారణ చేయించి బాధితులకు న్యాయం చేయాలని యాదవ జేఏసీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందజేయగా కలెక్టర్ వెంటనే స్పందించి కందుకూరు డిప్యూటీకి ఎంక్వైరీ వేసి వారం రోజుల్లో సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వవలసినదిగా ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు మిరియం శ్రీనివాసులు, బీసీవై పార్టీ జిల్లా కన్వీనర్ చల్లా హరి, యాదవ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దూళ్ల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్





(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, జూలై 6)

మద్దిపాడు మండలం పెదకొత్తపల్లి అంజయ్య నగర్ కాలనిలో ఊదరగుడి అర్చన ఓణీల వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అయన వెంట పోతినేని శ్రీనివాసరావు (పిఎస్‌ఆర్), గట్టినేని అయ్యన్న, నల్లూరి శ్రీనివాసరావు, ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, కాకి శైలజ, బొమ్మల చిరంజీవి, ఊదరపుడి బ్రహ్మయ్య, గోవిందమ్మ, శానం బ్రహ్మయ్య, తిరుపతమ్మ, ఊదరగుడి హనుమంతరావు, శాంతి, ఊదరగుడి రాంబాబు, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

## ఇక పై రోడ్ల పై చెత్త వేస్తే వెయ్యి రూపాయల వరకు జరిమానా కమిషనర్ ఆంజనేయులు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 6)

పొదిలి నగర పంచాయతీ పరిధిలోని వ్యాపారస్తులందరికీ మున్సిపల్ కమిషనర్ ఆంజనేయులు సోమవారం పలు హెచ్చరికలు జారీ చేశారు. పొదిలి పట్టణంలోని వ్యాపారస్తులు వారి షాపుల నుంచి వచ్చే చెత్తను చెత్తబుట్టలో కాకుండా రోడ్ల పై పడివేసినట్లయితే ఏ షాపు ముందు అయితే చెత్త ఉంటుందో ఆ షాపు యజమానులకు వెయ్యి రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందని శానిటరీ ఇన్స్‌పెక్టర్ మారుతీ రావు తెలిపారు. సోమవారం పాతూరులోని పలు షాపు యజమానులకు ఈ విషయం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట శానిటరీ మేస్త్రీలు కళ్యాణ్, ఖాదర్ బాష, ఇతర మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## నేడు, రేపు వైఎస్ఆర్ జిల్లాలో మాజీ సీఎం జగన్ పర్యటన



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 6)

జూలై 7న పులివెందులలో ప్రజాదర్బార్, జూలై 8న ఇడుపులపాయలో వైయస్సార్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని ఆయన కార్యాలయ ప్రతినిధి ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు ఆయన జిల్లాలో పర్యటించనున్నారని తెలిపారు. 7వ తేదీ ఉదయం 11.30 గంటలకు పులివెందుల చేరుకుంటారు. అనంతరం భాకరాపురం క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు. 8వ తేదీ బుధవారం ఉదయం పులివెందుల నుంచి బయలుదేరి ఉదయం 7.30 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైయస్సార్ ఘాట్ వద్ద నిర్వహించనున్న ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని నివాళులర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమం అనంతరం వైయస్ జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణం అవుతారని ఆ ప్రకటనలో వారు తెలిపారు.

## శరవేగంగా జరుగుచున్న ప్రత్యేక సమగ్ర సవరణ తహశీల్దార్ కె చిరంజీవి

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 6)

మార్కాపురం మండల పరిధిలో ఉన్నటువంటి దరిమడుగు, పెద్ద నాగులవరం, కొండేపల్లి, రామచంద్రపురం పోలింగ్ కేంద్రాలలో జరుగచున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని తహశీల్దార్ కె చిరంజీవి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన ఓటర్లు, శాశ్వత వలస ఓటర్లు, డబల్ ఓటర్లు వివరములును నమోదు చేయాలని, అలాగే డిజిటైజేషన్ త్వరీతిగతిన 100% పూర్తి చేయాలని బియల్‌ఓ లను, సూపర్వైజర్లును ఆదేశించినట్లు తెలియజేసారు. ఇప్పటికే 70% మంది ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించున్నారని, మరి ముఖ్యముగా యువతీ, యువకులు, మధ్య వయస్కులు, ముసలి వారు ప్రతి ఒక్క ఓటర్లు నుండి గ్రామీణ ప్రాంతాలలో సదరు కార్యక్రమము పట్ల మంచి స్పందన వస్తున్నట్లు తెలిపారు.

# జూలై 10న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలి

### ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఒంగోలు అర్బన్ కంపెనీ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 6)



జూలై 10న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఒంగోలు అర్బన్ కంపెనీ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు టి మహేష్ మాట్లాడుతూ అంగన్వాడి కనీస వేతనాలు, పెన్షన్ , ఈఎస్ఐ అమలు చేయాలని జులై 10వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నాని జయప్రదం చేయాలని. అంగన్వాడి వర్కర్స్ కు పిలుపునిచ్చారు కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్సి ఏర్పాటు 50 సంవత్సరాలు పూర్తయిన నేటికీ అంగన్వాడి కార్మికులను గుర్తించలేదు గుజరాత్ హైకోర్టు అంగన్వాడి ప్రభుత్వ ఉద్యోగాలు గుర్తించాలని వర్కర్స్ కి 28 ,400, హెల్పర్ కు 20,300 ఇవ్వాలని. 2022 సుప్రీంకోర్టు అంగన్వాడీలకి గ్రానైట్ అమలు చేయాలని ఇచ్చిన తీర్పులు అమలు చేయలేదు. రాష్ట్రంలో 2019 నుండి అంగన్వాడీలకు 42 రోజులు సమ్మె సందర్భంగా 2024 జులై నెలలో అంగన్వాడీ వేతనాలు పెంచుతామని ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం దాని అమలు చేయడం లేదు కొత్తగా తెచ్చిన నవచైతన్య యాప్ అంగన్వాడీలకు, మానసిక ఒత్తిడి గురవుతున్నారని. ఈ నేపథ్యంలో వేతనాలు పెంచాలని ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని జులై 10వ తేదీన అంగన్వాడి సమస్యలపై జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపడతారని పిలుపునిచ్చారు. పేదల, గర్భిణీలకు ,చిన్న పిల్లలకు ఉపయోగపడుతుంది. సరిపోయిన నిధులు కేటాయించలేకపోవటం లబ్ధిదారులు తగ్గించడం రకరకాల యాప్స్ పనివారం పెంచింది. అంగన్వాడి కనీసం వేతనం రూ.26,000 ఇవ్వాలని, పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ, సామాజిక భద్ర సౌకర్యాలు అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న మినీ సెంట్రల్‌ను మెయిన్ సెంట్రల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, హెల్పర్ల్కు ప్రమోషన్‌కు ఐదు సంవత్సరాలు సీనియారిటీ రద్దు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని పని భారం పెంచిన నవచైతన్య యాప్‌ను రద్దు చేయాలని పెండింగ్‌లో ఉన్న టిఏ, ఇంటి అద్దె బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. ఈ సమస్యలను పరిష్కారం చేయూలిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి ఏమీమో, యూనియన్ నాయకులు ముక్తార్, శ్రీలక్ష్మీ, లావణ్య, వాణి, తదితరులు పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

### 40వ వర్ధంతి సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుల నివాళి

(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జులై 6)



అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం కోసం జీవితాంతం కృషి చేసిన మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పుల్లలచెరువు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆరేవుల ఇస్సాకు ఆధ్వర్యంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బడిపాటి ఓబులు మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భారత రాజకీయాల్లో విశిష్ట నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. కేంద్రంలో రక్షణ, కార్మిక, వ్యవసాయం, రైల్వే తదితర కీలక శాఖల మంత్రిగా పనిచేస్తూ దేశాభివృద్ధికి విశేష సేవలు అందించారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణతో పాటు విద్య, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆరేవుల ఇస్సాకు మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి విద్యే ప్రధాన సాధనమని బాబు జగ్జీవన్ రామ్ విశ్వసించారని గుర్తు చేశారు. సమానత్వ సమాజ నిర్మాణమే ఆయన లక్ష్యమని, అదే స్ఫూర్తితో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమం కొనసాగుతోందని చెప్పారు. దేశంలో ఆహార భద్రత బలోపేతానికి, రైతుల సంక్షేమానికి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని నాయకులు కొనియాడారు. ఆయన దేశానికి అందించిన విశిష్ట సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బడిపాటి ఆంజనేయులు, మాజీ వైస్ సర్పంచ్ చిరదల రవి, లింగంగుంట్ల మరియదాస్, చిరదల పోతయ్య, కందుకూరి దేవదానం, బడిపాటి టైటాన్, గర్నెపూడి వెంకటేష్, బడిపాటి వెంకటయ్య (చిన్నోడు), బడిపాటి గురవయ్య, బడిపాటి మరియదాస్, ఆరేవుల సాత్విక్ ప్రిన్స్, బడిపాటి చిన్న వెంకట రాములు, తదితరులు పాల్గొన్నారు.

## హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే మెషిన్‌ను ప్రారంభించిన డాక్టర్ నాగేంద్ర

### సత్వరమే టీబీ, క్షయ వ్యాధి నిర్ధారణ హెచ్ఇఓ లోకేశ్వరి



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 6)

చిన్నగంజాం మారుమూల ప్రాంతాల్లో, గ్రామీణ శిబిరాల్లో టీబీ లక్షణాలను పసిగట్టడానికి, అత్యవసర సహాయక చర్యల్లో భాగంగా ఎక్స్‌రేలు తీయడానికి ఉపయోగించే హ్యాండ్ హెల్డ్ ఎక్స్ రే మెషిన్‌ను ప్రారంభించటం ఆనందంగా వుందని హెచ్ఇఓ లోకేశ్వరి అన్నారు. ఇది టిబీ, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తిస్తుందని డాక్టర్ నాగేంద్ర అన్నారు. సోమవారం మండలంలోని సంతరావురు ఆరోగ్య కేంద్రం పరిధిలోని గోనసపూడి విలేజ్ హేల్త్ సెంటర్ నందు గల చింతగుంపల గ్రామంలో 104 సంచార చికిత్స ప్రోగ్రాం లో భాగంగా హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే మెషిన్ ను డాక్టర్ నాగేంద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హేచ్ఇఓ లోకేశ్వరి, టిబిఎస్టిఎస్ పి వర్ష దార ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హేచ్ఇఓ లోకేశ్వరి మాట్లాడుతూ టిబిఏమ్బిఏ 2.0 ద్వారా సమకుర్చిన హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే మెషిన్ ద్వారా సత్వరమే టిబీ,క్షయా వ్యాధి నిర్ధారణ జరుగతుందని వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో 137 మందికి చేస్ట్ ఎక్స్‌రే తీసారు. ఈ కార్యక్రమంలో హేచ్ఇఓ లోకేశ్వరి, టిబిఎస్టిఎస్ పీ వర్షదార, డాక్టర్ బి నాగేంద్ర, 104 డిఇఓ పొదిలి రాఘవ, ఎమ్ఎల్‌హెచ్‌పి బి శిరీష, ఎఎన్ఎం పద్మ లత, ఆశలు పాల్గొన్నారు.

## ముప్పాళ్లలో యూరియా పంపిణీ




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 6)

మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో సోమవారం వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు మన్యం రమణయ్య ఆధ్వర్యంలో యూరియా పంపిణీ నిర్వహించారు. రమణయ్య మాట్లాడుతూ యూరియా కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. మునుముందు రైతులు నానో ఏరియా నానో డిఏపి వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, దేవరపల్లి వెంకటరామిరెడ్డి, డైరెక్టర్ చల్లా శ్రీనివాసరెడ్డి, కొండ్రగుంట నరసయ్య, దాసరి వెంకయ్య, ఎర్ర నరేంద్ర కుమార్, జి రమణారెడ్డి, కే మాధవరెడ్డి, మాల్యాద్రి, సీఈవో రవీంద్ర కుమార్, కే మాధవి, తదితరులు పాల్గొన్నారు.

# కులవివక్ష లేని సమాజం కోసం చైతన్యవంతమై సామాజిక శంఖారావాన్ని పూరిద్దాం : డి రమాదేవి

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 6)

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలుకులవివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని, వివక్ష లేని సమాజం కోసం సామాజిక శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేసి సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డి రమాదేవి పిలుపునిచ్చారు. సోమవారం ఒంగోలు ఎల్‌బీజీ భవన్‌లో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్), ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా వర్క్‌షాప్‌లో డి రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులను ప్రతి పౌరుడు అనుభవించేలా సమాజంలో చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కుల వివక్షను పూర్తిగా అంతమొందించాలంటే ప్రజాసంఘాలు, యువత, మహిళలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర పాలకులు మతోన్మాదాన్ని కులోన్మాదాన్ని రెచ్చగొట్టి చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. మరోవైపు పోరాటాల ద్వారా సాధించుకున్న భూములు పేదల స్థలాలను ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కట్టబడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా సామాజిక వివక్షతోపాటు దళితులు అభివృద్ధిలోను వివక్షకు గురవుతున్నారని అన్నారు. ఈ అంశాలను సమగ్రంగా అధ్యయనం చేస్తామని పాలకులపై పోరాడి



వివక్ష రూపాలు నిర్మూలించే విధంగా, అంతిమంగా కుల నిర్మూలన కోసం ఈ ఉద్యమాలు కొనసాగుతాయని అన్నారు. ఈ జిల్లా వర్క్‌షాప్‌కు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వి మోజేష్ అధ్యక్షతన జిల్లా వర్క్ షాప్ నిర్వహించారు. వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి భాస్కరయ్య మాట్లాడుతూ కులవివక్ష నిర్మూలనకు గ్రామీణ స్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలని, సామాజిక సమానత్వ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ రాబోయే మూడు నెలల కార్యాచరణ ప్రణాళికను ప్రవేశపెట్టారు. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో అధ్యయన యాత్రలు ప్రచార యాత్రలు, పోరాట కార్యక్రమాల ప్రణాళిక తదితర అంశాలు ప్రవేశపెట్టారు. సామాజిక శంఖారావాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కే మాబు మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికులు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని పేర్కొన్నారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి రఘురామ్ జిల్లాలో దళితుల పై కొనసాగుతున్న వివిధ రకాల వివక్ష, సామాజిక బహిష్కరణ, దాడులు, భూఆక్రమణలు, ప్రభుత్వ పథకాల అమలులో జరుగుతున్నా వివక్ష, స్మశాన లేని అనే సమస్యలు న్యాయం కోసం పోరాడుతున్న బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇటువంటి అన్యాయాలను అరికట్టేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజలను చైతన్యపరుస్తూ ఉద్యమాలను విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల జిల్లా, నాయకులు, సిఐటియు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జె.జయంతి బాబు కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి. బాలకోటయ్య మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరస్వామి, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి టి తిరుపతయ్య ఇతర జిల్లా కార్యకర్తలు, మహిళలు, యువజన ప్రతినిధులు పాల్గొన్నారు.

## మండవ సాయి సుందర్‌కి ట్యాలీ ఎంఎస్ఎంఈ హానర్స్ 2026 గౌరవం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 6)






ఒంగోలు నగరానికి చెందిన యువ వ్యాపారవేత్త మండవ సాయి సుందర్‌కి ట్యాలీ ఎంఎస్ఎంఈ హానర్స్ 2026 సంవత్సరానికి అరుదైన గౌరవం లభించింది. సోమవారం సాయంత్రం బెంగళూరు నగరంలోని రిడ్జ్ కార్ల్టన్ నందు జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. వీరి తండ్రి మండవ మురళీకృష్ణ ప్రముఖ వ్యాపారవేత్తగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా సాయి సుందర్‌కి వారి కుటుంబ సన్నిహితులు మిత్రులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేసి అభినందనలు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## కంభం ఘోర రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

వైద్య ఖర్చుల కోసం రూ.60 వేల ఆర్థిక సాయం



(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 6)

మండలంలోని కందులాపురం సెంటర్ సమీపంలో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గిద్దలూరు పట్టణం నల్లబండ బజార్‌కు చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ ఘటన గురించి తెలుసుకున్న గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జున రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వైద్య ఖర్చుల నిమిత్తం రూ.60,000 నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వారి బాధ వర్ణనాతీతమని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబానికి పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 'మీకోసం' అర్జీల పరిష్కారానికి జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 6)

'మీకోసం' అర్జీల పరిష్కారానికి జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ .పి. రాజాబాబు స్పష్టం చేశారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ' మీకోసం ' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డిఆర్ఓ .పి.వెంకటరమణ, ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 254 అర్జీలు వచ్చాయి. వీటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కింద స్థాయి సిబ్బంది ఇచ్చే నివేదికలపై ఆధారపడకుండా జిల్లా స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. శాఖాపరంగా పథకాల అమలును నిరంతరం పరిశీలిస్తూ ఉండాలన్నారు.'మీకోసం ' అర్జీల పరిష్కార తీరును పరిశీలించేందుకు, సమన్వయం చేసేందుకు ప్రత్యేకంగా నియోజకవర్గానికి ఒక అధికారిని పెడతామన్నారు. ' మీకోసం అర్జీలకు పరిష్కారం, ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ లో సానుకూల ప్రజాభిప్రాయం పెంపు కోసం ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నందున అధికారులు కూడా ఇదే స్ఫూర్తితో మరింత చురుకుగా పనిచేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. 'మీకోసం' అర్జీలకు సకాలంలో సహేతుక పరిష్కారం చూపాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్ రెడ్డి, డిపిఓ అనుపమ, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# చిన్నారుల్లో వైకల్యాలను ప్రారంభ దశలోనే గుర్తించాలి

### చికిత్స అందిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే అవకాశం ఉంది

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు







(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జులై 6)

ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లోని జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌లో ఒమేగా రిహాబ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే లేదా బాల్యంలో గుర్తించే వైకల్యాలను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే వారి జీవితంలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చని అన్నారు. సంతానం కోసం తల్లిదండ్రులు చేసే త్యాగాలు అపారమని, అలాంటి సమయంలో పిల్లలకు ఏదైనా వైకల్యం ఉందని తెలిసినప్పుడు కుటుంబం ఎదుర్కొనే మానసిక వేదనను ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రపంచ స్థాయి వైద్య సేవలు, ఆధునిక పరికరాలు, నిపుణులైన వైద్యులను అందుబాటులో ఉంచిందన్నారు.ప్రభుత్వ ఆసుపత్రులపై ఉన్న అపోహలను ప్రజలు విడిచిపెట్టాలని, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధిక ఖర్చులు భరించక ముందే జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఇక్కడ ఉచితంగా నాణ్యమైన వైద్యం, అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు, పునరావాస సేవలు అందుతున్నాయని తెలిపారు. ఈ కేంద్రంలో జరుగుతున్న మంచి సేవలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. డాక్టర్లు సూచించిన ఫాలో–అప్ తేదీలను తల్లిదండ్రులు తప్పకుండా పాటించాలని, ప్రారంభ దశలో నిరంతర చికిత్స అందిస్తే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని చెప్పారు.దివ్యాంగుల ధృవీకరణ పత్రాలు, పెన్షన్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి సులభంగా అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.సమాజంలో దివ్యాంగ చిన్నారులకు అండగా నిలుస్తూ సేవలందిస్తున్న ఒమేగా రిహాబ్ ఫెడరేషన్‌ను, ఆసుపత్రికి సేవలందిస్తున్న మురళీకృష్ణని, జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ బృందాన్ని, ముఖ్యంగా డాక్టర్ సునీతని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ఆశను, ఆత్మవిశ్వాసాన్ని అందించే వైద్యులు, సేవా సంస్థల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ సందర్భంగా పలువురు బాల భవిత కేంద్రంలో వారికి అందుతున్న సేవల గురించి తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, బాల భవిత కేంద్రం నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్, వైద్య విభాగ అధిపతులు డాక్టర్ మస్తాన్ బాషా, డాక్టర్ ఏడుకొండలరావు, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ తిరుపతిరెడ్డి, దివ్యంగులశాఖ అడిషనల్ డైరెక్టర్ సువార్తమ్మ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో ఆపన్నులకు అన్నపూర్ణగా స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 6)

కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పేద రోగులు, వారి బంధువులు, ఆహార వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారికి ఉచిత భోజన వసతి కల్పించి ఆపన్నహస్తం అందజేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి కుటుంబ సభ్యులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, అనాధలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ట్రస్ట్ సభ్యులు స్వయంగా వండిన భోజనం పంపిణీ చేస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ట్రస్ట్ కన్వీనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ పేదవారికి ఆహారం అందించడం ద్వారా కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిదని తెలిపారు. మనము చేసిన చిన్న సహాయం కూడా ఎన్నో కుటుంబాల్లో ఆశను నింపుతుంది. ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తూ మరెందరికో ఉపశమనం కలిగించడం మా లక్ష్యం అని పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా అనేక మంది రోగులు, వారి బంధువులు, పేదలు ఉపశమనం పొందుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శివశంకర్, నజీర్ భాష, జేమ్స్, కిషోర్ బాబు, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.





## దేశసమైక్యత కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేత శ్యాం ప్రసాద్ ముఖర్జీ

### శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పించిన బిజెపి నాయకులు

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 6)

చిన్నగంజాం దేశ సమగ్రత, సమైక్యత కోసం శ్యాం ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని బిజెపి మండల అధ్యక్షుడు ఉలిచి రాజేష్ అన్నారు. బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలంలోని స్థానిక బిజెపి కార్యాలయం నందు మండల అధ్యక్షుడు ఉలిచి రాజేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జన సంఘ స్థాపకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ125వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఉలిచి ఏసుబాబు మాట్లాడుతూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను వ్యతిరేకిస్తూ, "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, రెండు ప్రధానులు ఉండరు" అనే అచంచల విశ్వాసంతో పోరాడిన మహోన్నత దేశభక్తుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. పర్మిట్ విధానాన్ని నిరసిస్తూ జమ్మూ–కాశ్మీర్‌లోకి ప్రవేశించి అరెస్టుకు గురై, అనంతరం అనుమానాస్పద పరిస్థితుల్లో ప్రాణాలు విడిచిన వారి త్యాగం భారత సమైక్యతకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రేపాక మంగతాయారు, బిఎల్ఏ 1 శిఖరం కోటయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు అనుమాలశెట్టి శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి మోటుమర్రి వెంకటేశ్వర్లు, మాజీ మండలాధ్యక్షుడు అమరా మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా మీ కోసం



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 6)

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్న జిల్లా పోలీసులు తెలిపారు. ప్రకాశం జిల్లా పోలీసులు సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు 85 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా ప్రజల నుంచి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సోమవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన "మీకోసం" కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ పి శ్రీధర్, పోలీసు అధికారులతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదిదారులు తమ సమస్యలకు సంబంధించిన వ్రాతపూర్వక అర్జీలను పోలీస్ అధికారులు స్వీకరించారు. పోలీస్ అధికారులు ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదుల యొక్క సారాంశం తెలుసుకొని, వాటిని చట్టపరంగా త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అదే విధంగా అందిన ఫిర్యాదుల వివరాలను సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేసి, త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను సమీపంలోని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్–డివిజన్ కార్యాలయాల్లో కూడా అందజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, చీటింగ్, అత్తరింటి వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో దర్శి సీఐ రామారావు, ఒంగోలు రూరల్ సీఐ శేషగిరిరావు, గుడ్లూరు ఎస్ఐ కె వెంకట్రావు, ప్యానెల్ అడ్వకేట్ బి బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ యాసిన్, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని వీడండి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 6)

పీజీఆర్ఎస్ కు వచ్చే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వాన్ని వీడాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులతో కలసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కార విషయంలో ఆలస్యం చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. అన్ని శాఖలకు సంబంధించిన వారు ఎండార్స్మెంట్లు ఇస్తున్నారు తప్ప పరిష్కార విషయంలో అశ్రద్ధ చేస్తున్నారని తెలిపారు. ఒకే సమస్య పై పదేపదే అర్జీలు రావడం జరుగుతుందని, దీన్ని మరోసారి పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారుల మీదే ఉందని వివరించారు. ప్రజల సంతృప్తి మేరకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆదేశించారు. ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 254 అర్జీలు రాగా వీటిలో రెవెన్యూకు సంబంధించిన 135, ఇతర సమస్యల పై 119 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, హౌసింగ్ పీడీ మోహన్‌రావు, జిల్లా రవాణాశాఖ అధికారి రాంబాబు, జిల్లా ఇన్చార్జి వ్యవసాయ అధికారి బాలాజీ నాయక్, ఐసిడిఎస్ ఇంచార్జ పీడీ పద్మావతి, డిఎల్‌డిఓ బాలు నాయక్, ఉద్యానశాఖ అధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## దర్శి ఎస్ఐగా గాలి ఏడుకొండలు




(షణ్ముఖ వెలుగు, దర్శి, జులై 6)

దర్శి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా గాలి ఏడుకొండలు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం జిల్లా విఆర్‌లో ఉన్న ఆయనకు సోమవారం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
7 | 07.07.26 మంగళవారం

## మైనారిటీ నిరుద్యోగ యువతకు కొరకు జాబ్ మేళా

### ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్




(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 6)

టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మెన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో రాష్ట్రం లోని మైనార్టీ (ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైను) నిరుద్యోగ యువతీ యువతలకు గాను 11-07-2026న విజయవాడలోని షాజనుర్ ముసాఫిర్ ఖానా నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నారని షేక్ రసూల్ తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో మొత్తం దాదాపు 40-50 కంపెనీలలో గల ఉద్యోగాలకు 10వ తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల వరకు పూర్తి చేసిన యువతి, యువకులకు 09-07-2026 లోపు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి వివరాలకు 9963746997, 0866-2491148, 9849901148, 9985306408 ఫోన్ల ద్వారా లేదా ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎన్టీఆర్ సర్కిల్ పడమట విజయవాడ కార్యాలయంలో సంప్రదించగలరని షేక్ రసూల్ తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 6)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని బద్వేల్ రోడ్డు నందు సోమవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల మధ్య మోటారు వాహనం పై వెళ్తున్న అంబటి శివశంకర్ రెడ్డి (39)ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదానికి గురై మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి మైదుకూరు మండలం సుంకులు గారి పల్లె గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

## సర్ పై నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 6)

సర్ పై నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అన్నారు. సోమవారం ఉదయం నగరంలోని గుంటూరు రోడ్డు లోని పార్టీ కార్యాలయం నందు నియోజకవర్గంలోని క్లస్టర్ 2, 8, 9, 10లోని ఇంచార్జిలు, డివిజన్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండే విధంగా చూడాలన్నారు. మృతులు, డబుల్ ఎంట్రీలు, బోగస్ ఓటర్లు ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని తెలియజేసారు. జులై 14వ తేదీ లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నందున డివిజన్లలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపార్టీ అధ్యక్షులు బండారు మదన్, క్లస్టర్ ఇంచార్జిలు, తదితరులు పాల్గొన్నారు.

# రావణ్ పై ఉపా కేసు రద్దు చేయాలి

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డి రమాదేవి డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 6)




ప్రశ్నించే గొంతుకుల పై ఉక్కు పాదం మోపటం అమానుషమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి రమాదేవి విమర్శించారు. 'ప్రశ్న' యూట్యూబర్ రావణ్ పై రాష్ట్ర ప్రభుత్వం ఉపా కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం నుండి రంగారాయుడు చెరువు వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అక్కడ జరిగిన నిరసన కార్యక్రమంలో రమాదేవి మాట్లాడుతూ ప్రశ్నించే వారిపై కుట్ర కేసులు మోపడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్లకు కట్టబెడుతున్నాయని, మత ఉన్మాద చర్యలతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నాయని ఆమె విమర్శించారు. ఇలాంటి చర్యల నుండి ప్రజల ఆలోచనలను, ప్రతిఘటనలను అనిచిపెట్టి పెట్టేందుకే ఇటువంటి ఫేక్ కేసులు పెడుతున్నారని అన్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి ఏదైతే మాట్లాడాడో దాన్ని ప్రస్తావించినందుకు ఒక సాధారణ యూట్యూబర్ పై ఐదు కేసులు పెట్టారని అన్నారు. అన్నీ కేసులలో కోర్టు బెయిలు ఇవ్వగా ఊరూరు తిప్పుతూ, ప్రభుత్వ అనుకూల శక్తులను ఉసిగొలుపుతూ, నిరంకుశ పద్ధతులకు పాల్పడటాన్ని ఆమె తప్పు పట్టారు. రాష్ట్రంలో మానవ హక్కులు మృగ్యమవుతున్నాయని, విజయవాడకు చెందిన సాయి కృష్ణ, క్రాంతి కుమార్ లాకప్ హత్యలు రుజువు చేస్తున్నాయని అన్నారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా కేంద్రం నడిచిన బాటలోనే రాష్ట్రం కూడా నడుస్తున్నదని మండిపడ్డారు. రైతు ఉద్యమాన్ని సమర్థించారని ప్రవీణ్ పుర్కాతను అమానుషంగా జైల్లో పెట్టారని కోర్టు దాన్ని తీవ్రంగా తప్పు పట్టిందని గుర్తు చేశారు. అనేకమంది మానవ హక్కుల కార్యకర్తలను ప్రజాస్వామ్య హక్కులపై ప్రశ్నిస్తున్న వారిని ఉపా కేసులు పెట్టి నిర్బంధిస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను ఆమె ఖండించారు. తక్షణమే రావణ్ పై పెట్టిన ఉపా కేసు ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే మాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు యం.భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ చర్య ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందని అన్నారు. బూతులు మాట్లాడారని ఒక యూట్యూబర్ను అరెస్టు చేసే ముందు అంతకంటే ఎక్కువగా, అసలు రాయటానికే వీలుగాని భాషను మాట్లాడిన ఉపముఖ్యమంత్రి, అధికార పార్టీకి చెందిన ఇతర నేతలను ముందు అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. రాజ ద్రోహం నేరం మోపటం ప్రశ్నకు సమాధానం చెప్పటం చేతగాక, అధికారం చేతిలో ఉంది కాబట్టి అక్రమ కేసులు బనాయించేలా ఉందని వారు అన్నారు. ఇలాంటి కేసులు పెట్టేటప్పుడు మనం ఏ రాజ్యంలో ఉన్నాం, అసలు రాజు ఎవరు, ఆ రాజుకు ద్రోహం చేసిన వారెవరు అని ఈ కేసు విషయంపై వారు ఎద్దేవా చేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి రఘురాం అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కారుసాల శ్రీనివాసరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు చీకటి శ్రీనివాసరావు, నెరుసుల వెంకటేశ్వర్లు, సిహెచ్ మజుందార్, వి బాలకోటయ్య, కంకణాల రమాదేవి, కె రాజేశ్వరి, సిహెచ్ వినోద్, బి. వీరాస్వామి, జి వెంకటేశ్వర్లు, కే వెంకటేశ్వర్లు, కేజీ మస్తాన్, ఎం ఆంజనేయులు, బంకా సుబ్బారావు, జివిబి కుమార్, ఎం కొండయ్య, పల్లాపల్లి ఆంజనేయులు, టి రంగారావు, కెవి పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించిన ఎస్టియు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 6)

ఉలవపాడు మండలం రాష్ట్ర టీచర్స్ యూనియన్ సోమవారం మండలంలో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మండలంలో పనిచేయుచున్న టీచర్లకు క్యాజువల్ లీవ్ పుస్తకాలు, లంచ్ క్యారేజ్ బ్యాగులు పంపిణీ చేసి టీచర్ల పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి కాటాబత్తిన కృష్ణ, మండల అధ్యక్ష కార్యదర్శులు బడితల శ్రీనివాసులు, వేల్పుల రమేష్, పిగిలి శ్రీనివాసరావు, గట్టిబోయిన రమేష్, ఆలూరి చిట్టిబాబు, అంబటి ప్రసాద్, వెంకట సునీల్ కుమార్, రాయపాటి భాస్కర్, ఓగుబోయిన శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ విద్యాలయాలకు మొబైల్ డిస్పెన్సరీ వాహనాలు అందజేత ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 6)

ఒంగోలు కలెక్టర్ కాంప్లెక్స్ నందు జవహర్ నవోదయ విద్యాలయం, ఒంగోలు, మార్కాపురం రెండు విద్యాలయాలకు మొబైల్ డిస్పెన్సరీ వాహనాలను ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి జవహర్ నవోదయ విద్యాలయ, ఒంగోలు, కాలుజువ్వలపాడు వారికీ రూ 7.25 లక్షలు చొప్పున విద్యాలయ వెహికల్ కోసం ఎంపి లాడ్స్ మంజూరు చేసి, శనివారం ఒంగోలు జిల్లా కలెక్టరేట్ వారి కార్యాలయంలోని స్పందన హాల్ ముందు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనకుమారి, ఒంగోలు, కనిగిరి, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, బిఎన్ విజయ కుమార్ సమక్షంలో మాగుంట శ్రీనివాసులరెడ్డి రెండు విద్యాలయ వెహికల్స్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ సి శివరాం, మార్కాపురం జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మీ, వైస్ ప్రిన్సిపాల్ ఎ రఘు, ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ ఆఫీస్ సూపరింటెండెంట్ (రిటైర్డ్) మల్లికార్జునరావు, మార్కాపురం జవహర్ నవోదయ విద్యాలయ ఆఫీవ్ సూపరింటెండెంట్ ప్రసాద్, విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. విద్యాలయం సిబ్బంది అందరు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## మాజీ ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి గొట్టిపాటి



(షణ్ముఖ వెలుగు, కొరిశపాడు, జులై 6)

రావినూతల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రామినేని రమణ తండ్రి ఇటీవల మృతి చెందగా, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి నివాళు లర్పించిన మంత్రి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలని వారికి ధైర్యం చెప్పారు. పార్టీ ఎల్లప్పుడూ వారి కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మంత్రి వెంట పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆకతాయిల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న మైదుకూరు అర్బన్ సీఐ కె రమణారెడ్డి

### ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేస్తే తాటతీస్తామని హెచ్చరిక

### అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో మైదుకూరు వీధుల్లో గస్తీ

(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 6)

మైదుకూరు పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, ముఖ్యంగా మహిళలు, విద్యార్థినుల భద్రత విషయంలో మైదుకూరు అర్బన్ సీఐ కె రమణారెడ్డి సింగం తరహాలో ఉక్కుపాదం మోపారు. వైఎస్ఆర్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, మైదుకూరు పరిధిలో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌లకు అడ్డుకట్ట వేసేందుకు సీఐ రమణారెడ్డి సరికొత్త యాక్షన్ ప్లాన్‌తో రంగంలోకి దిగారు.

**డ్రోన్ నిఘా.. ఆకతాయిలకు చెక్!**

ఇటీవల కాలంలో స్కూళ్లు, కాలేజీల వద్ద పెద్దపెద్ద శబ్దాలు చేసే మోడిఫైడ్ బైక్‌లతో విద్యార్థినులను వేధిస్తున్నారన్న ఫిర్యాదులపై సీఐ రమణారెడ్డి తక్షణమే స్పందించారు. కేవలం సాధారణ పెట్రోలింగ్‌కే పరిమితం కాకుండా, టెక్నాలజీని వాడుతూ అత్యాధునిక డ్రోన్ కెమెరాలను రంగంలోకి దించారు. స్కూళ్లు, కాలేజీల ప్రారంభ మరియు ముగింపు సమయాల్లో ఈ డ్రోన్ల ద్వారా ప్రతి వీధిని జల్లెడ పడుతున్నారు. ఈ సందర్భంగా సీఐ కె.రమణారెడ్డి ఆకతాయిలను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. "రోడ్లపై తిరుగుతూ అమ్మాయిలను వేధించినా, ర్యాగింగ్‌కు పాల్పడినా తాటతీస్తాం. డ్రోన్ కెమెరాల కంటికి చిక్కితే క్షమించేదే లేదు, కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి లోపల వేస్తాం" అని మైదుకూరు సీఐ హెచ్చరికలు జారీ చేశారు. తల్లిదండ్రులకూ సీఐ కీలక సూచన: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సీఐ



రమణారెడ్డి తల్లిదండ్రులకు ఒక బాధ్యతాయుతమైన విజ్ఞప్తి చేశారు. "మీ పిల్లలు కాలేజీలకు వెళ్తున్నారా లేదా బయట తిరుగుతున్నారా అనేది తల్లిదండ్రులు గమనించాలి. బైక్ సైలెన్సర్లు మార్చి రోడ్లపై హల్‌చల్ చేస్తే సహించేది లేదు. ఒక్కసారి కేసు నమోదైతే మీ పిల్లల భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయి, కాబట్టి మీ పిల్లల ప్రవర్తనను కనిపెట్టుకుని ఉండండి" అని సూచించారు.

**పట్టణ ప్రజలు, మహిళల హర్షం :**

మైదుకూరు పట్టణంలో మహిళల భద్రత కోసం సీఐ రమణారెడ్డి స్వయంగా రంగంలోకి దిగి, విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ అండగా నిలబడడం పట్ల విద్యార్థినులు, మహిళలు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రమణారెడ్డి లాంటి డైనమిక్ ఆఫీసర్ మైదుకూరులో ఉండడం వల్ల తాము ధైర్యంగా తిరగగలుగుతున్నామని మహిళలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ ముమ్మర తనిఖీలు, నిఘా కార్యక్రమంలో ఎస్ఐ కత్తి వెంకట రమణ, పోలీస్ సిబ్బంది అత్యంత చురుగ్గా పాల్గొని సీఐ ఆదేశాల మేరకు ఆకతాయిల ఆట కట్టించే పనిలో నిమగ్నమయ్యారు.







# కిలో రూ.200 తగ్గకుండా పొగాకు కొనాల్సిందే
# కంపెనీ ప్రతినిధులతో మాట్లాడిన ఎమ్మెల్యే ఇంటూరి

## చెప్పినా రేట్లు పెంచకపోతే ఎలా?
## రైతులకు అన్యాయం జరగకుండా చూడండి
## 27వ నెంబర్ వేలం కేంద్రంలో కొనుగోళ్లు పరిశీలించిన ఎమ్మెల్యే

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 6)**

కందుకూరులోని పామూరు రోడ్డులో గల 27వ నెంబరు పొగాకు వేలం కేంద్రాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం సందర్శించి, కొనుగోళ్లు పరిశీలించారు. వలేటివారిపాలెం నుంచి 500కు పైగా బేళ్లు రాగా, దాదాపు గంటన్నర సేపు వేలాన్ని గమనించారు. 160 నుంచి 200 రూపాయల లోపే ఎక్కువగా కొనుగోళ్లు జరుపుతున్నట్లు ఎమ్మెల్యే గుర్తించారు. అనంతరం రీజనల్ మేనేజర్ ప్రసాదరావు, వేలంకేంద్రం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వ్యాపార ప్రతినిధులు, రైతు నాయకులతో ఎమ్మెల్యే నాగేశ్వరరావు సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వారం క్రితం స్వయంగా ముఖ్యమంత్రి పొగాకు కంపెనీ ప్రతినిధులతో సమావేశమైనప్పుడు, కిలో పొగాకు 200 లోపు తగ్గకుండా కొనాలని, నో బిడ్స్ ఉండకూడదని ఆదేశించారు. కానీ ఇక్కడ చూస్తే ధరలు దారుణంగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. రైతులు ఎఫ్ 1 నుంచి ఎఫ్ 3 రకం వరకు నాణ్యమైన పొగాకు తీసుకువస్తున్నా 160 నుంచి 180 మధ్యనే కొంటున్నారు. ఎప్పుడూ సగం పొగాకు కొనే ఐటీసీ, జిపిఐ కంపెనీలు కూడా 200 రూపాయలకు మించి కొనడం లేదు. వారిని చూసి మిగతా కంపెనీలు మరీ తక్కువకు కొనుగోళ్లు చేస్తున్నారు. ఇలాగైతే చాలా కష్టం. రైతుల్లో ఓపిక తగ్గిపోతోంది. కనీసం ముఖ్యమంత్రి గారు ఆదేశించినట్లుగా కొనుగోళ్లు చేయాల్సిందే. రైతుల ఆవేదనను వ్యాపారులు అర్థం చేసుకోవాలి. బోర్డు నిర్దేశించిన 140 మిలియన్ కిలోల పొగాకుకు, ముందుగా అనుకున్న ప్రకారం గిట్టుబాటు ధర ఇవ్వాల్సిందే. సరైన రేట్లు లేని కారణంగా 1999లో పొగాకు పంటకు క్రాప్ హాలిడే ప్రకటించారు. మరోసారి అలాంటి పరిస్థితి రానివ్వద్దు. ?? పొగాకు రైతులను ఆదుకోవాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. త్వరలో మరోసారి ప్రతినిధులతో సమావేశం ఉంది. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా వ్యాపారులపై ఒత్తిడి పెడుతున్నాం అని ఎమ్మెల్యే నాగేశ్వరరావు మీడియాతో చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడి శ్రీనివాసరావు, ఏడి రహీం, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, రైతు సంఘం నాయకుడు తాటికొండ రమణయ్య, నియోజవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, వలేటివారిపాలెం మండల తెలుగు రైతు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రైతు నాయకులు వలేటి నరసింహం, మన్నం కృష్ణ, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, రాష్ట్ర ముస్లిం మైనారిటీ కమిటీ అధికార ప్రతినిధి షేక్ రఫీ, క్లస్టర్ ఇంచార్జ్ వడ్డేళ్ల రవిచంద్ర, అత్తంటి శ్రీహరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.









## ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య





**(షణ్ముఖ వెలుగు, పామూరు, జులై 6)**

పోకూరి బాలకృష్ణ (39) పామూరు పట్టణంలోని సెయింట్ మార్క్స్ స్కూల్ ఎదురుగా నివసిస్తున్నాడు. వ్యాపారం కోసం తెచ్చిన అప్పులతో ఆశించినంత లాభం రాక అప్పులు తీర్చలేక అప్పు ఇచ్చిన వాళ్లు తిరిగి అప్పు అడుగుతుండగా, తన దగ్గర అప్పు తీసుకున్న వాళ్లు ఇవ్వక ఏమి చేయాలో అర్థం కాక ఈ నెల 5వ తేదీ ఆదివారం రాత్రి తన స్నేహితులతో కలిసి సెకండ్ షో సినిమాకు వెళ్లి అర్థరాత్రి సుమారు 1 గంట సమయంలో ఇంటికి వెళ్లిన తరువాత తన భార్యతో బెడ్ రూమ్‌లో పడుకుంటున్నానని చెప్పి పడుకున్నాడు. ఆ తర్వాత సెయింట్ మార్క్స్ స్కూల్లోని ఒకటో తరగతి స్కూల్ క్లాస్ రూమ్‌లో నైలాన్ తాడుతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం సుమారు 6.50 గంటల సమయంలో స్కూల్లో స్వీపర్ గా పనిచేస్తున్న ఆమె క్లాసు రూములు శుభ్రం చేయటం కోసం వెళ్లి చూసి గట్టిగా కేకలు వేసే సరికి చుట్టుపక్కల వారు, మృతుడి బంధువులు వెళ్లి చూసి మృతుడిని కిందకు దించి మృతుడి భార్య పోకూరి అనూష పామూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పామూరు పోలీసులు తెలిపారు.

## ఎస్ఐ ని కలిసిన మండల యూత్ అధ్యక్షులు



**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 6)**

మండల తెలుగు యువత అధ్యక్షులు బుడ్డపల్లి గ్రామానికి చెందిన నంద్యాల పెద్దకాశయ్య వారి మిత్రబృందం సోమవారం తర్లుపాడు మండల నూతన ఎస్ఐగా విధుల్లో చేరిన సిహెచ్ శివబసవ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐకి ని శాలువాలతో సత్కరించి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత సభ్యులు బత్తుల నరసింహులు, తమ్మిశెట్టి శేషు, దేవండ్ల నారాయణ, బత్తుల పవన్ కళ్యాణ్, బేతం పిచ్చయ్యలు సంయుక్తంగా కలిసి ఎస్ఐకి శాలువా వేసి పూలమాలతో ఘనంగా సత్కరించారు.

## డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పించిన బిజెపి జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 6)**

మార్కాపురం పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు భారతీయ జన సంగ్ వ్యవస్థాపకులు అపర విద్యావేత్త, అఖండ భారత దేశ ఐక్యత కోసం పోరాడిన వీరుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా బిజెపి నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు మాట్లాడుతూ అఖండ భారత్ కోసం ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు ఇద్దరు ప్రధానులు రెండు జెండాలు ఉండకూడ దని ఏక్ దేశ్ మే దో విధాన్ దో ప్రధాన్ ఔర్ దో నిషాన్ నహి చాలాంగే అని కాశ్మీర్ సంపూర్ణ విలీనం కోసం గలమెత్తిన సింహమని అన్నారు. జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల్లోకి వెళ్ళడానికి పర్మిట్ విధానాన్ని వ్యతిరేకిస్తూ దేశ సమగ్రత కోసం పోరాడి జైలులోనే అమరత్వం పొందిన మహనీయుడని కొనియాడారు. 33 ఏళ్లకే కలకత్తా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ అయి మాతృభాషకు, భారతీయ సంస్కృతికి, వందేమాతరంతో విద్యాసంస్థల్లో జాతీయ చైతన్యం నింపిన దేశభక్తుడు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కొక్కెర శ్రీనివాసరావు , డాక్టర్ కిరణ్, బొంతల కృష్ణ, వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, జీవీ రెడ్డి, పాలంకయ్య, బొచ్చు మల్లారెడ్డి, ముని, తదితరులు పాల్గొన్నారు.

## వరుస చోరీల దొంగ అరెస్టు
## 2 బైకులు, 51.50 గ్రాముల బంగారం, 218 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం






**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 6)**

పగటిపూట తాళం వేసిన గృహాలే టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న చల్లా నాగరాజును పొదిలి పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సోమవారం సాయంత్రం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ రాజేష్ కుమార్ వివరాలు వెల్లడించారు. నాగరాజుది పొదిలి మండలం రాజుపాలెం గ్రామం. ఇతను పగలు తాళాలు వేసిన గృహాలే ఆసన టార్గెట్. వాటిని టార్గెట్ చేసుకొని దొంగతనాలకు పాల్పడుతుంటాడు. ఇటీవల బుచ్చనపాలెం, చినారికట్ల, నందిపాలెం గ్రామాల్లో ఇంట్లో బీరువాలు పగులగొట్టి దొంగిలించిన 23 గ్రాములు బంగారు తాడు, చెవిచుట్లు 2, చెవిదుద్దులు 2, వెండి కుంకుమ భరణి 10, బంగారు రెండు వరుసల తాడు 24 గ్రాములు, వెండి చెంబు 208 గ్రాములు, రూ.5 వేలు నగదుతో పాటు రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్‌బైక్, ఒప్పో సెల్ ఫోన్ రికవరి చేసినట్లు ఆయన తెలిపారు. వీటి విలువ రూ.7లక్షల 50 వేలు ఉంటుందన్నారు. నాగరాజు పై భవానీపురం, తాడేపల్లి, దర్శి పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నాట్లు సీఐ చెప్పారు. మీడియా సమావేశంలో సిఐ రాజేష్ కుమార్, ఎస్ఐ సూరెడ్డి రాజేష్, కానిస్టేబుళ్ళు షాకీర్, కోటేశ్వరరావులు ఉన్నారు.

# రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేకనే జగన్ అబద్ధాల ప్రచారం

## జైల్లో చిప్పకూడు తిన్న బుద్ధిరాని బొల్లా
## ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 6)**

వినుకొండలోని గంగినేని సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్రస్థాయి విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్‌కు పదవి పోయాక, అవినీతి సంపద ఆగిపోయాక ఏం చేయాలో పాలుపోవడం లేదని, అమరావతిలో జరుగుతున్న 50 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులను చూసి తట్టుకోలేక ఈర్ష్యా ద్వేషాలతో రగిలిపోతున్నారని మండిపడ్డారు. నిత్యం అబద్ధాలు చెప్పి నిజాలు మాట్లాడటమే జగన్ మర్చిపోయారని ఎద్దేవా చేశారు. గతంలో అధికారంలో ఉండగా గుంటూరు-విజయవాడ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా మాట్లాడి, 2019 ఎన్నికలకు ముందు అమరావతిలో ఇల్లు కట్టుకున్నానని చెప్పి, గెలిచిన తర్వాత మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడారని విమర్శించారు. ఆనాడు మూడు రాజధానుల పేరుతో మూడు రూపాయలు ఖర్చు పెట్టలేదు సరే కదా, కనీసం మూడు ఇటుకలైనా పెట్టారా అని ప్రశ్నించారు. ఇప్పుడు కొత్తగా అమరావతి మధ్య పోటీ అనడం సిగ్గుచేటని, కేంద్రం చేసిన చట్టాలను గౌరవించడం జగన్‌కు గానీ, ఆ పార్టీ నాయకులకు గానీ తెలియదని ఆరోపించారు. జగన్ ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని, 100 జన్మలెత్తినా అమరావతి రాజధానిగానే ఉంటుందని, దానిని జగన్ మార్చలేరని స్పష్టం చేస్తూ, ఆ విషయాన్ని మర్చిపోతేనే ఆయనకు గౌరవంగా ఉంటుందని హితవు పలికారు. వైఎస్సార్సీపీకి తెలిసిందల్లా ఎదుటివారిపై అవినీతి బురద చల్లటమేనని, గత ప్రభుత్వంలో ఇసుక, మద్యం, గనుల తవ్వకాల్లో విపరీతంగా దోచుకున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రాల్లో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ దూకుడుగా అభివృద్ధి పనులు చేపడుతోందని చెప్పారు.రాష్ట్ర అంశాలతో పాటు స్థానిక మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిపై కూడా జీవీ ఆంజనేయులు తీవ్ర ఆరోపణలు చేశారు. దురాశ దుఃఖానికి చేటని, 1500 కోట్ల రూపాయల విలువైన ఆస్తిని కేవలం 30 కోట్ల రూపాయలకే కొట్టేయాలని బొల్లా పన్నాగం పన్నారని విమర్శించారు. తన బంధువు నాగేశ్వరరావు పేరుతో దొంగ జీవో సృష్టించిన ఘనత బొల్లాదేనని, చంచల్‌గూడ జైలుకు వెళ్లి వచ్చినా ఆయన బుద్ధి మారలేదని, గతంలో చేసిన తప్పులకు కూడా మళ్లీ జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. పాల శాతం తగ్గించి రైతులను మోసం చేయవద్దని, బొల్లా యాజమాన్యంలోని పాల కంపెనీలపై కేసులు ఎందుకు ఉన్నాయో సమాధానం చెప్పాలన్నారు. తాను శివశక్తి ఫౌండేషన్ ద్వారా 1998 నుండి నిరంతరాయంగా ఉచిత కంటి ఆపరేషన్లు, పేద విద్యార్థు లకు ఉపకార వేతనాలు ఇస్తూ పేదలను ఆదుకుంటుంటే, ఈ దేశంలో చందాలు ఇవ్వబడవు అని బోర్డు పెట్టిన ఏకైక పిసినారి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అని ఎద్దేవా చేశారు. తాను క్రమబద్ధంగా ఆదాయపు పన్ను, అమ్మకపు పన్ను కడుతూ ఓడినా గెలిచినా ప్రజాసేవలోనే ఉన్నానని, వందల కోట్లు ఆస్తులు ఉండి ఏం లాభమని, బొల్లా ఒక పెద్ద విలన్ అని మండిపడ్డారు. బొల్లా ఫ్యాక్టరీకి తోలుకున్న వేల ట్రాక్టర్ల మట్టిపై సమాధానం చెప్పాలని, దళితుల, ప్రైవేట్, ప్రభుత్వ భూములను లాక్కున్న పాపాలు భవిష్యత్తులో అనుభవించక తప్పదన్నారు. గతంలో 100 పడకల ఆసుపత్రి కడుస్తానని చెప్పి ఒక్క ఇటుకైనా పెట్టకుండా ముస్లింలను మోసం చేశారని విమర్శించారు.మరికొన్ని స్థానిక అంశాలపై స్పందిస్తూ, రామలింగేశ్వర స్వామి ఘాట్ రోడ్డు పనులను భక్తులు చందాలు వేసుకుని చేస్తే, ఆ పనులకు బొల్లా బ్రహ్మనాయుడు బిల్లులు ఎలా పెట్టుకుంటాడని నిలదీశారు. గిరి ప్రదక్షిణ రోడ్డును వేయకుండా, కేవలం తన భూములకు మాత్రం సిమెంట్ రోడ్డు ఎలా వేసుకున్నాడో చెప్పాలన్నారు. బ్రహ్మనపల్లి-కారంపూడి రోడ్డును జాతీయ రహదారి అని చెప్పి, చుట్టుపక్కల భూములు అమ్ముకుని, చివరికి పంచాయతీ డబ్బులతో రోడ్డు వేయించుకున్నాడని ఆరోపించారు. తెలివిగా దోపిడీ చేయడంలో బొల్లా బ్రహ్మనాయుడికి సాటి ఎవరూ లేరని విమర్శించారు. అలాగే రామలింగేశ్వర స్వామి ఆలయ గోపురం రాతి కట్టడం కాకుండా ఇటుకలతో కడుతున్నారంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. వైఎస్సార్సీపీ అధికారంలో ఉండగా రాసుకున్న ఒప్పందం ప్రకారమే ఇప్పుడు ఆలయ నిర్మాణం జరుగుతోందని, ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యం గానీ, అవినీతి గానీ లేవని స్పష్టం చేశారు. ఇలాంటి దుష్ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. జీవీ ఆంజనేయులు మాటల మనిషి కాదు, చేతల మనిషి అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com


# కాకినాడ కాపు అమ్మాయి - కనిగిరి మాదిగ అబ్బాయి
# ఒంగోలులో దళిత నేత నీలం ఆధ్వర్యంలో కులాంతర వివాహం





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 6)**

కాకినాడ పోలీసులు కాపు గంగరాజు బంధువుల నుండి రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన దళిత నేత నీలం నాగేంద్ర రావు. కాకినాడకు చెందిన కాపు కుల యువతి మత్స గంగభవాని కనిగిరికి చెందిన మాదిగ యువకుడు పరిశపోగు రాహుల్ కులాంతర వివాహ వేడుక ఒంగోలులో దళిత హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. కాకినాడ జిల్లా , శానికవరం మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన కాపు కుల యువతి మత్స గంగభవాని గోదావరి జిల్లా భీమవరంలో శ్రీ విష్ణు కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో డిప్లమో ఇన్ ఫార్మసీ లో చేరింది. 2022లో అదే కాలేజీలో బి ఫార్మసీ చదవటానికి వెళ్లిన మార్కాపురం జిల్లా కనిగిరి మండలం బల్లి పల్లి గ్రామానికి చెందిన మాదిగ కులానికి చెందిన పరిసిపోవు రాహుల్ కూడా అదే కాలేజీలో డి ఫార్మసీ చేరాడు. కాలేజీలో నాలుగేండ్ల డిప్లమో ఇన్ ఫార్మసీ పూర్తి అయ్యేసరికి వీరిద్దరూ డిప్లమాటిక్ గా ప్రేమించుకున్నారు. తమ కులాలు వేరైనా కలసి జీవించాలని నిర్ణయించుకున్నారు. కానీ గంగాభవాని తండ్రి కాపు కులానికి చెంది కలప వ్యాపారం చేసే గంగరాజు కుటుంబానికి తన కూతుర్ని మాదిగ యువకుడికి ఇచ్చి పెళ్లి చేయటం ఇష్టం లేదు. కూతుర్ని కాబోయే అల్లుడ్ని గంగరాజు బంధువులు గంగరాజు తో పాటు అనేకసార్లు బెదిరించారు. గంగాభవానికి తన కులానికి చెందిన మరో యువకుడితో పెళ్లి సంబంధం నిశ్చయించారు. తాను రాహుల్ ని ప్రేమించానని తమ ప్రేమావివాహానికి అడ్డుపడద్దని తమ కులాంతర వివాహాన్ని ఆశీర్వదించాలని గంగాభవాని తన కుటుంబ సభ్యులను అనేకసార్లు ప్రాధేయపడింది. కానీ కాలకోట కుల ద్వంతరులు అల్లుకున్న గంగరాజు కుటుంబం గంగాభవాని నిర్బంధించి బలవంతంగా పెళ్లి చేయాలని కాపు కాశారు. చాకిసక్యంగా ఇంటిలో నుండి తప్పించుకొని కాకినాడ నుండి తాను ప్రేమించిన రాహుల్ కోసం గంగాభవాని కనిగిరి మాదిగ పల్లికి చేరుకుంది. తర్వాత ఒంగోలు అంబేద్కర్ భవన్లో గత నెల 27 వ తారీఖున వీరిద్దరి కులాంతర వివాహం చేసుకున్నారు. కుల కక్షతో కూటమి ప్రభుత్వ అండతో రెచ్చిపోయిన గంగరాజు తన 24 సంవత్సరాల వయసు కలిగిన మేజర్ అయిన గంగాభవాని తదితరులపై పోలీసు కేసు పెట్టారు. అంతట కాకినాడ పోలీసు వారు కనిగిరి ఒంగోలు రాహుల్ బంధువుల్లో స్నేహితులు ఫోన్లు చేసి ఇళ్లకు వెళ్లి గంగాభవానిని అప్పచెప్పాలంటూ హడావుడి చేస్తున్నారు. ఈ క్రమంలో తమకు పోలీసుల నుండి మరియు కాపు గంగరాజు కుటుంబ సభ్యుల నుండి రక్షణ కల్పించాలని కులాంతర వివాహ జంట గంగా భవాని రాహుల్ దళిత నేత నీలం ఆశ్రయించారు. అంతట ఒంగోలులోని తన కార్యాలయంలో సోమవారం గంగాభవాని రాహుల్ల కులాంతర వివాహ వేడుక నీలం నాగేందర్ నిర్వహించారు. అనంతరం ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబును ఒంగోలు గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద కలిసి కులాంతర వివాహ జంటకు చట్ట ప్రకారం రక్షణ కల్పించి వధువు తరుపు కాపు బంధువులను బైండోవర్ చేయించవలసినదిగా ఫిర్యాదు చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న కుటుంబాల వారు అంగీకరించిన ఎస్సీ ఎస్టీ యువకుల్ని,యువతుల్ని పెళ్లికి అంగీకరించటానికి అగ్రకులాలతోపాటు బీసీ కులాల వారు కూడా ఒప్పుకోవటం లేదని కొత్త పట్టణం మండలం రాజుపాలెం లాంటి గ్రామాల్లో గౌడ కులానికి చెందిన యువకుడు ఎస్సీ మాల కులానికి చెందిన యువతని ప్రేమించి పెళ్లి చేసుకుంటే సదరు కుటుంబం కులాంతర వివాహాన్ని అంగీకరించి తమ ఇంట్లో పెట్టుకున్న గౌడ పెద్దలు కులాంతర వివాహ గౌడ కులానికి చెందిన కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ చేసి దాడి చేశారన్నారు. కొత్తపట్నం పోలీస్ స్టేషన్ లో కూటమి అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో అక్రమ కేసు కట్టించారన్నారు. కొన్నిచోట్ల వధూవరులను నమ్మకంగా ఇంటికి పిలిపించుకొని కులాంతర వివాహాలు చేసుకున్న ఎస్సీ ఎస్టీ యువకులను దారుణంగా చంపుతున్నారన్నారు. మరికొన్ని చోట్ల దళిత యువకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారన్నారు. మేజర్లైన కులాంతర వివాహం చేసుకున్న యువతులని పోలీసుల సహాయంతో కిడ్నాప్ చేసి తీసుకెళ్ళుతున్న ఘటనలు ఉన్నాయని కూలంకుషంగా జిల్లా కలెక్టర్ రాజా బాబుకు దళిత నేత నేల నాగేంద్రరావు వివరించారు. స్పందించిన కలెక్టర్ తాము మార్కాపురం జిల్లా ఇన్చార్జి ఎస్పి హర్షవర్ధన్ రాజుకు కులాంతర వివాహ జంట రక్షణకై ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ను కలసిన వారిలో పివి రావు మాల మహానాడు అధ్యక్షుడు ధారా అంజయ్య,మాదిగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు పత్రా బంగారం, మాలసభ కన్వీనర్ మేడికొండ మురళి, సమతా వేదిక కన్వీనర్ ఏలూరు శ్రీనివాసరావు, ఏపీడీఆర్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు గొంటె గాని పేతురు తదితరులు ఉన్నారు.

## తుడుమెల్ల మురళికి ఘన సన్మానం





**(షణ్ముఖ వెలుగు, బద్వేలు, జులై 6)**

పౌరసరఫరాలు, ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన తుడుమెల్ల మురళీకృష్ణకు సోమవారం సాయంత్రం స్థానిక క్యాట్ రెస్టారెంట్‌లో ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా బద్వేల్ పట్టణ అభివృద్ధి కమిటీ చైర్మన్ నాన్నబాల వెంకటేశ్వర్లు, పసుపులేటి రమణయ్య, టీడీపీ గోపవరం మండల నాయకులు కొమ్మిశెట్టి సుబ్బయ్య, వేముల హరికుమార్, గనుమంతు రాజేష్, కొమ్మూరి నరేష్, వేముల నరసింహ, రవి, పిడుగు సాయి, కొమ్మూరి హరి, రమణ తదితరులు మురళీకృష్ణను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్ అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ తుడుమెళ్ళ మురళికి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు, అలాగే తుడిమెళ్ళ మురళి కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా నియమితులైన వల్లం కొండు వెంకటరమణ శాలువాతో సత్కరించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## బాబు జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి డాక్టర్ కుక్కమూడి ప్రసాద్



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జులై 6)**

ఈ దేశ తొలి దళిత మాజీ ఉప ప్రధాని, స్వతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివని దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ కుక్కమూడి ప్రసాద్ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ 40 వ వర్ధంతి సందర్భంగా సోమవారం మాచర్ల పట్టణంలోనిఆయన విగ్రహం వద్ద దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ దళితుల,అణగారిన వర్గాల హక్కుల కోసం వారి అభ్యున్నత కోసం మహిళా సాధికారత కోసం సామాజిక న్యాయం కోసం కృషిచేసిన వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అని, భారత రాజకీయ చరిత్రలో ఎక్కువ కాలం కేంద్ర మంత్రిగా పనిచేసిన రికార్డు ఆయనదని,ఆయన యొక్క జీవితాన్ని,కృషి, పట్టుదలను యువత ఆదర్శంగా తీసుకొని దేశానికి సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకుడు ఆరుమళ్ళ ఇశ్రాయేలు పాల్గొన్నారు.

## మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపిన వెంకటాపురం వైసీపీ కుటుంబాలు



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 6)**

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను వెంకటాపురం గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబాలు సోమవారం సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం ప్రకటించాయి.జనరాజుపల్లి కోటేశ్వరరావు, దాసరి రామయ్య, పాలపర్తి సౌలు, జనరాజుపల్లి ఐజాక్, దాసరి ఆనందరావు కుటుంబాల సభ్యులు మంత్రిని కలిసి ఆయన నాయకత్వంపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు.మంత్రి గొట్టిపాటి రవికుమార్ వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ, ప్రజా సేవే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## నేటి నుండి వైభవంగా ప్రారంభం కానున్న శ్రీవారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు







**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జూలై 6)**

బద్వేల్ పట్టణంలోని సిద్ధపటం రోడ్డులో వెలిసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయస్వామి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుండి ఈ నెల 12వ తేదీ ఆదివారం వరకు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వహకులు వల్లంకొండు వెంకటరమణ, అధ్యక్షులు నిమ్మకాయల గురివిరెడ్డి గౌరవ అధ్యక్షులు త్రివిక్రమ్ సింగ్, సెక్రటరీ గొడిసిపాటి అంకయ్య, వల్లంకొండు శివ కుమార్, మెంటా వెంకట నాగేంద్ర, మలే పెంచల్‌రెడ్డి, రమణయ్య, గంగిరెడ్డి, సురేష్, హరి, సిరిగిరి నారాయణ, పలువురు కమిటీ సభ్యులు తెలియజేశారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆలయ ప్రధాన అర్చకులు వీరేశచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. కావున స్వామి వారి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు బద్వేల్ ప్రాంత ప్రజలు భక్తులు విరివిరిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని పలువురికి తెలియజేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగానే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పలు కార్యక్రమాలు చేపట్టారు. కావున యావత్తు భక్తులు ప్రతి ఒక్కరు స్వామి వారి బ్రహ్మోత్సవాలలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూలై 6)**

ప్రభుత్వ సర్వీసులో ఉన్నవారు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. కారుణ్య కోటాలో ఉద్యోగాలు పొందిన ఏడుగురికి సోమవారం గ్రీవెన్స్ హాలులో ఆయన నియామకపత్రాలను అందించారు. కొత్తగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరినందున విధులు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పట్ల అవగాహన పెంచుకుని మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి, డిఆర్ఓ పి వెంకటరమణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కుందేరు ఆధునికరణకు గ్రీన్ సిగ్నల్స్
# రైతన్నల గుండెల్లో ఆనందం



### ఎమ్మెల్యే ఏలూరి కృషితో రూ.517.50 లక్షలు మంజూరు
### డ్రెడ్జింగ్‌తో కుందేరు డ్రెయిన్‌కు కొత్త కళ
### రైతుల్లో వెల్లి విరుస్తున్న ఆనందం

**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 6)**

వర్షాకాలం వచ్చిందంటే చాలు, బాపట్ల జిల్లా రైతుల గుండెల్లో దడ మొదలవుతుంది. కుందేరు డ్రెయిన్ పూడికతో నిండిపోవడంతో వరద నీరు ముందుకు కదలక, పొలాలన్నీ జలమయమై ఏటా పంట నష్టం తప్పడం లేదు. ఈ దుస్థితికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన కృషి ఎట్టకేలకు ఫలించింది. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని కుందేరు డ్రెయిన్ 11.300 కి.మీ నుంచి 18.950 కి.మీ వరకు డ్రెడ్జింగ్ పనులకు రూ.517.50 లక్షల నిధులు మంజూరవడంతో నియోజకవర్గ రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సమస్యను గుర్తించి పరిష్కారం దిశగా అడుగులుకృష్ణా డెల్టా వ్యవస్థలో కీలకమైన కుందేరు డ్రెయిన్ ఏళ్ల తరబడి పూడికతో నిండిపోయి, నీటి ప్రవాహ సామర్థ్యాన్ని కోల్పోయింది. దీంతో వర్షాకాలంలో వచ్చే వరద నీరు సాఫీగా సముద్రంలో కలవలేక, చుట్టుపక్కల గ్రామాల్లోని పంట పొలాలను ముంచెత్తుతోంది. ఏటా ఇదే తంతు రైతులను ఆర్థికంగా కుంగదీస్తోంది. ఈ విషయాన్ని లోతుగా అధ్యయనం చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కృష్ణా డెల్టా వ్యవస్థ చీఫ్ ఇంజినీర్‌ను సంప్రదించి సమగ్ర ప్రతిపాదన సిద్ధం చేయించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, నిధుల మంజూరు కోసం నిరంతరం కృషి చేశారు.

**జీవో జారీ...** అధికారికంగా ఆమోదంఎమ్మెల్యే కృషి ఫలితంగా, జల వనరుల శాఖ బుధవారం జీవో ఆర్టీ నెంబర్ 369ను జారీ చేస్తూ కుందేరు డ్రెయిన్ డ్రెడ్జింగ్ పనులకు పరిపాలనా అనుమతి మంజూరు చేసింది. 2025-26 ఎస్ఎస్ఆర్ ప్రకారం రూ.517.50 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. రైతుల్లో ఆనందం..డ్రెడ్జింగ్ పూర్తయితే వరద నీరు వేగంగా ముందుకు సాగి, పంట పొలాలు నీట మునగకుండా కాపాడుకోవచ్చని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాకుండా ఉన్న సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించిందని, ఇది తమ కష్టాలకు తెరదించే అడుగని రైతులు అభిప్రాయపడుతున్నారు. పనులు త్వరితగతిన మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజినీర్‌ను ప్రభుత్వం ఆదేశించడంతో, డ్రెడ్జింగ్ పనులు వేగం అందుకోనున్నాయి.తన నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషిని రైతులు అభినందిస్తున్నారు.